ప్రజాశక్తి
మంగళవారం 29 అక్టోబర్ 2024
8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

కంటకాపల్లి రైలు ప్రమాదానికి ఏడాది !

◆ నాడు ఇద్దరు లోకో పైలట్లు, ట్రైన్ మేనేజర్ సహా 17 మంది మృతి

◆ ఘటన కారణాలపై రైల్వే సేఫ్టీ కమిషన్ విచారణ ◆ నేటికీ పూర్తి నివేదిక గోప్యమే..



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన రైలు బోగీలు (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ - విజయనగరం జిల్లా సరిహద్దుల్లోగల 'అలమండ-కంటకాపల్లి' వద్ద 2023 అక్టోబర్ 29 సాయంత్రం 7 గంటలకు జరిగిన రైలు ప్రమాదం ఇప్పటికీ కళ్లముందు కదలాడుతూనే ఉంది. సరిగ్గా ఏడాది క్రితం జరిగిన ఈ దుర్ఘటన ఈ ప్రాంత రైలు ప్రమాదాల్లో అత్యంత విషాదకరమైనది. ఆ ఘటనతో ప్రజలంతా ఒక్కసారిగా తీవ్ర ఆందోళన చెందారు. ఈ ప్రమాదంలో ఇద్దరు లోకో పైలట్లు, ట్రైన్ మేనేజర్ (గార్డు)తో పాటు 14 మంది ప్రయాణికులు మృతిచెందిన విషయం తెలిసిందే. వాల్తేరు రైల్వేలో జరిగిన ఈ ప్రమాదంలో 50 మంది ప్రయాణికులు గాయాలతో బయటపడ్డారు. ప్రమాదంపై అప్పట్లో విచారణ సాగినప్పటికీ నేటికీ పూర్తి నివేదిక బహిర్గతం కాలేదు.

ఆ రోజు ఏం జరిగింది ?

విశాఖ నుంచి పలాస వెళ్తున్న ప్రత్యేక పాసింజరు రైలు కొత్తవలస మండలం అలమండ - కంటకాపల్లి వద్ద సిగ్నల్ కోసం పట్టాలపై సాయంత్రం 7 గంటల సమయంలో ఆగింది. వెనకాలే వస్తున్న విశాఖ - రాయగడ రైలు దాన్ని ఢీకొట్టింది. ఈ రైళ్లలో అత్యధికంగా ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన కూలీలు, కార్మికులే ఉన్నారు. ప్రమాదంలో మొత్తం 5 బోగీలు పట్టాలు తప్పాయి. 17 మంది కన్నుమూశారు. 50 మంది వరకూ గాయాలపాలయ్యారు.

సేఫ్టీ కమిషన్ విచారణ ఏం తేల్చింది ?

కమిషన్ ఆఫ్ రైల్వే సేఫ్టీ (సిఆర్ఎస్) ఈ రైలు ప్రమాద ఘటనపై విచారణ చేపట్టింది. 10 మంది బృందం ఈ ప్రాంతంలో అప్పట్లో పర్యటించింది. ముఖ్యంగా కమిషనర్ ఆఫ్ రైల్వే సేఫ్టీ (నార్త్ ఈస్ట్ సర్కిల్) ప్రంజీవ్ సక్సేనా కొన్ని ప్రాథమిక నిర్ధారణలు చేశారు. ఈ ప్రమాద వైఫల్యాలపై అప్పట్లో స్పందిస్తూ రైల్వే అడ్మినిస్ట్రేషన్ వైఫల్యం దీంట్లో ఉందని, మిగతా 2లో..



తిమ్మరాజుపేటలో ప్రచారం నిర్వహిస్తున్న రైతు సంఘం నాయకులు కర్రి అప్పారావు

నేడు పాల రైతుల మహాధర్నా

◆ సొమ్ము దుర్వినియోగంపై ఆగ్రహం

◆ విశాఖ డెయిరీ యాజమాన్యంపై విచారణ జరపాలని, పాల ధర పునరుద్ధరించాలని డిమాండ్

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

విశాఖ డెయిరీ యాజమాన్యం అవినీతి, రైతుల ఆవు పాల ధర తగ్గింపుపై ఉత్తరాంధ్ర జిల్లాల పాల రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలోనే పాల ధరను యథాతథంగా పునరుద్ధరించాలని, పశువుల దాణా ధర తగ్గించాలని, అవినీతిపై విచారణ చేపట్టి, బాధ్యులపై చర్యలు తీసుకొని డెయిరీ ఆస్తులను పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ పాల రైతుల సంఘం ఆధ్వర్యంలో ఉమ్మడి విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల పాల రైతులు మంగళవారం ఉదయం 11 గంటలకు విశాఖ నగరంలోని విశాఖ డెయిరీ ప్రధాన కార్యాలయం వద్ద మహా ధర్నా చేయనున్నారు. కొద్ది రోజుల క్రితం ఆవు పాల ధరను మూడు రూపాయలమేర డెయిరీ తగ్గించడంతో కోట్లాది రూపాయలు యాజమాన్యానికి ఆదా కానుంది. వినియోగదారులకు అమ్ముతున్న పాల ధరలు, రైతుకు విక్రయిస్తున్న దాణా ధరలను భారీగా పెంచుతున్నప్పటికీ అవినీతి మూలంగా డెయిరీ నష్టాల పాలవుతుందన్న మిగతా 2లో..

స్టీల్‌ప్లాంట్‌లో బ్లాస్ట్ ఫర్నేస్ - 1 ప్రారంభం

▶ వార్త మెయిన్‌లో..

సమస్యలపై మున్సిపల్ కార్మికుల ఆందోళనలు

▶ వార్త 8లో..

8 నుండి ప్రజల సమస్యలపై పోరాటాలు

▶ వార్త 8లో..



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రవీంద్ర

గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన

అనకాపల్లి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొల్లు రవీంద్ర

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు రాష్ట్ర ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆయన అధ్యక్షతన సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా అభివద్ధికి విజన్ 2027, వికసిత్ భారత్ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. రోడ్లు, ఇసుక, ఇళ్ల నిర్మాణాలు, సిఎస్ఆర్ నిధులపై చర్చించారు. జిల్లాలో ఇసుక డిపో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. శాసనసభ స్పీకరు చింతకాయల అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ అన్‌రాక్ అల్యూమినియం ఫ్యాక్టరీ ఒప్పందాలు అమలుచేసేలా చర్యలు మిగతా 2లో..

మేలు జరిగేలా సాగుదారుల చట్టం - 2024

అగ్రికల్చరల్ అండ్ మార్కెటింగ్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజశేఖర్



మాట్లాడుతున్న రాజశేఖర్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పంట సాగుదారుల చట్టం - 2019లో ఉన్న లోపాలను దృష్టిలో పెట్టుకొని దాని స్థానంలో అందరికీ మేలు జరిగేలా సాగుదారుల చట్టం - 2024ను తీసుకురావాలనే ఉద్దేశ్యంతో ఉన్నామని స్టేట్ అగ్రికల్చరల్ అండ్ మార్కెటింగ్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ సాగుదారుల చట్టం - 2024పై సోమవారం మధ్యాహ్నం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆరు జిల్లాల వారితో ప్రాంతీయ సదస్సు నిర్వహించారు. కొత్త సాగుదారుల హక్కు చట్టం - 2024 ఏర్పాటుపై అవగాహన కల్పించి, భూ యజమానులు, కౌలు రైతులు,

క్షేత్ర స్థాయిలో చర్చించి నిర్ణయం తీసుకోవాలి

- ఎపి రైతు సంఘం నాయకులు గండి నాయనబాబు



కొత్త చట్టంపై గ్రామాల్లో క్షేత్ర స్థాయిలో చర్చించి నిర్ణయం తీసుకోవాలని ఎపి రైతు సంఘం అనకాపల్లి జిల్లా నాయకులు గండి నాయనబాబు కోరారు. సదస్సులో ఆయన మాట్లాడుతూ నూతన కౌలు చట్టం తీసుకొస్తున్న సమయంలో కొన్ని సూచనలను తెలియజేశారు. భూయజమాని సంతకం, అంగీకారంతో సబంధం లేకుండా ప్రభుత్వమే కౌలు రైతులను గుర్తించి కౌలు గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. గ్రామాల్లో దండోరా ద్వారా ప్రచారం చేసి గ్రామ సభలు నిర్వహించి ధరఖాస్తులు మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

కంటకాపల్లి రైలు ప్రమాదానికి ఏడాది !

ఘటన జరిగాక నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్సెస్ పనితనం నైపుణ్యవంతంగా లేదని ఘాటు వ్యాఖ్య చేశారు. నేరుగా రైల్వే బోర్డు నుంచే వీరు విచ్చేశారు. నివేదిక కూడా అక్కడే సమర్పించారు. కానీ పూర్తి స్థాయిలో బయటపెట్టలేదు. ఆటోమేటిక్ సిగ్నల్‌ను దాటుకుంటూ లోకోమోటివ్ పైలట్ ట్రైన్ నెంబరు 08504 డేంజర్ సిగ్నల్ చూడకుండా వెళ్లిపోయారని నివేదించారు. అసిస్టెంట్ లోకో పైలట్ ట్రైన్ నెంబరు 08504 ఎమర్జెన్సీ బ్రేక్‌లు వేయలేకపోయాడని పేర్కొన్నారు. కానీ దీంట్లో పైలట్ తప్పేలేదని లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ క్లెయిమ్ చేసింది. రైల్వే బోర్డుతోనూ ఈ అంశంపై పోరాడడంతో కమిషన్ నివేదిక తప్పు అని తేలింది. రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ స్పందిస్తూ 'ఆరోజు క్రికెట్ మ్యాచ్ జరుగుతుండడంతో పైలట్‌లు ఆ మ్యాచ్ చూసుకుంటూ యాక్సిడెంట్ చేశారు' అని వ్యాఖ్యలు చేయడంపైనా రైల్వే సంఘాలు భగ్గుమన్నాయి.

వాస్తవానికి 'అమృత్ భారత్ పథకం' నిధుల ఖర్చులో రైల్వేల్లో భద్రత, మౌలిక వసతుల కల్పనకు పూర్తిస్థాయిలో వెచ్చించడం లేదన్న విమర్శలు నానాటికీ పెరుగుతున్నాయి. సిగ్నలింగ్ వ్యవస్థలను బలోపేతం చేయడం, ట్రాక్‌లపై రైళ్లకు మధ్య సరైన దూరం ఉండేలా చర్యలు తీసుకోవడం వంటివి ఆచరణలో చేయాల్సి ఉంది.

నేడు పాల రైతుల మహాధర్నా

ఆరోపణలు ఎంతో కాలం నుంచి ఉన్నాయి. 2018లో జరిగిన సాధారణ సమావేశంలో రూ.250 కోట్ల మూల ధనం ఉన్నట్లు చూపిన యాజమాన్యం ఆ డబ్బు ఏమైందన్న దానిపై నోరు విప్పడంలేదు. రైతుకు డివిడెండ్ ఇవ్వలేదు. బోనస్ బకాయి చెల్లించలేదు. డెయిరీకి పాలుపోయని కొంతమందిని దీర్ఘకాలికంగా డైరెక్టర్లుగా కొనసాగించడం వంటి తప్పుడు పద్ధతులను యాజమాన్యం కొనసాగిస్తోంది. కొంతమంది విశ్రాంత ఉద్యోగులకు లక్షల రూపాయలు చెల్లించి డెయిరీ డబ్బులను దుర్వినియోగం చేస్తోంది. ఈ నేపథ్యంలో విశాఖ డెయిరీ పరిరక్షణ కోసం రైతులు మంగళవారం ధర్నా చేపట్టనున్నారు. పాల రైతుల సొమ్మును ఇష్టానుసారం దుర్వినియోగం చేస్తున్న యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు డిమాండ్ చేశారు. పాల ధరను పునరుద్ధరించకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన

తీసుకోవాలన్నారు. అనకాపల్లి ఎంపీ సిఎం.రమేష్ మాట్లాడుతూ జిల్లాలో స్టీల్ ప్లాంట్, లాజిస్టిక్ హబ్ ఏర్పాటు చేయాలన్నారు. హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ గ్రామ సచివాలయాల్లో సెక్రటరీ, విలేజ్ రెవిన్యూ అధికారుల పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఈ సమావేశంలో కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్‌పి తుహిన్ సిన్హా, ఎమ్మెల్సీలు వేపాడ చిరంజీవిరావు, దువ్వారపు రామారావు, ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, పంచకర్ల రమేష్‌బాబు, కెఎస్ఎన్.రాజు, సుందరపు విజయకుమార్, బండారు సత్యనారాయణమూర్తి, రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్, మౌలిక సదుపాయాల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, రాష్ట్ర హౌసింగు కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబు, జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, డిఆర్ఒ బి.దయానిధి, ఆర్‌డిఒలు షేక్ ఆయిషా, వివి.రమణ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేసిన వారిని ఆదుకోవాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాష్ట్రంలో ప్రభుత్వ మద్యం దుకాణాల్లో ఐదేళ్లు సూపర్‌వైజర్లు, సేల్స్ మేనేజర్లుగా పనిచేసిన వారికి కూటమి ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా ఉపాధి కల్పించి ఆదుకోవాలని ఎఐటియుసి జిల్లా కార్యదర్శి జిఎస్‌జె.అచ్యుతరావు, నాయకులు కసిరెడ్డి సత్యనారాయణ కోరారు. సోమవారం అల్లిపురంలోని ఎఐటియుసి కార్యాలయంలో ఎపి బేవరేజ్ కార్పొరేషన్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్యకర్తల సమావేశం జరిగింది. దీనిలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు ఎం.మన్మధరావు, మోహన్ రావు, హరినాధరావు, గణేష్, మహదేవ్, రాము తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎపి స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ విశాఖ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా పి.మోహన్‌రావు, కార్యదర్శిగా బి.హరినాధరావు ఎన్నికయ్యారు.

విశాఖ డెయిరీ యాజమాన్యం భూ కబ్జాపై చర్య తీసుకోవాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ రెవెన్యూ డివిజన్ పరిధి గాజువాక మండలం మింది గ్రామ సర్వే నెంబరు 47/3లో సుమారు వంద కోట్ల విలువచేసే మూడు ఎకరాల ప్రభుత్వ భూమిని విశాఖ డెయిరీ యాజమాన్యం కబ్జా చేసిందని, దీనిపై చర్య తీసుకోవాలని జనసేన కార్పొరేటర్ పీతలమూర్తి యాదవ్, మింది గ్రామానికి చెందిన కొంతమంది సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో శ్రీరామ్, అప్పలరాజు, వనమాడ అప్పలరాజు, అంగ నూకేశ్వరరావు, వెంకటరమణ, కంబాల సూరిబాబు పాల్గొన్నారు.

జోరుగా ఇసుక తవ్వకాలు



గోస్తనీ నదిలో సాగుతున్న తవ్వకాలు

ప్రజాశక్తి- పద్మనాభం : కూటమి ప్రభుత్వం ఇసుక తవ్వకాలపై ఇచ్చిన అనుమతులు ఆధారంగా మండలంలోని పొట్నూరు గ్రామానికి చెందిన కొంతమంది టైరు బండ్లు యజమానులు గ్రామానికి ఆనుకొని ఉన్న గోస్తని నది నుంచి ఇసుకను తీస్తున్నారు. పరివాహకతీరంలో ఇసుక లేకపోవడంతో సుమారు 7 నుండి 10 అడుగుల లోతులో నుంచి ఇసుకను తీసి టైరు బండ్లకు వేసి గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలకు తరలిస్తున్నారు. దీంతో గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలు కొనసాగుతున్నాయి.

మేలు జరిగేలా సాగుదారుల చట్టం - 2024



మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

(మొదటి పేజీ తరువాయి..) అధికారుల అభిప్రాయాలు సేకరించి చట్టం అమలుకై ఈ సదస్సు చేపట్టినట్టు నిర్వాహకులు తెలిపారు. తొలుత వ్యవసాయ శాఖ సలహాదారులు డిల్లీరావు మాట్లాడుతూ సిసిఆర్‌సి చట్టం 2019లో ఉన్న లోపాలను, రాబోయే కాలంలో ఏర్పాటు చేయనున్న నూతన చట్టంలో ఉంచుతున్న అంశాలను తెలియజేశారు. అనంతరం స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజశేఖర్ మాట్లాడుతూ సాగుదారులను ప్రోత్సహించాలన్న సంకల్పంతో ఉన్నామన్నారు. కొత్త చట్టం ప్రకారం.. పంట రుణాలను ఎలా ఇవ్వనున్నారో ఆయన తెలిపారు. జూన్ 1 నాటికి కౌలు రైతు కార్డు ఇప్పించేలా చేయడం, పంట రుణాలు అందించేలా చేయడం కొత్త చట్టం ముఖ్య ఉద్దేశమన్నారు. విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ ఈ సదస్సు ద్వారా సాగుదారులు, భూ యజమానుల చట్టంపై అవగాహన ఏర్పరుచుకుని అందరికీ తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న వివిధ జిల్లాలకు చెందిన కౌలు రైతులు, భూ యజమానులు, ఎన్‌జిఒలు, కౌలు రైతుల సంఘాల నాయకులు మాట్లాడుతూ పంట రుణాలు పొందడంలో ఉన్న సమస్యలను వివరించారు. ఆరు జిల్లాల నుండి విచ్చేసిన జిల్లా వ్యవసాయ అధికారులు, ఎడిఎలు, విఆర్‌ఒలు, తహశీల్దార్లు, వ్యవసాయదారులు, బ్యాంక్ అధికారులు, కమర్షియల్ ఆఫ్ అగ్రికల్చర్ అడిషనల్ డైరెక్టర్ శ్రీవర, అగ్రికల్చరల్ డిప్యూటీ డైరెక్టర్ ఎం.పద్మావతి, అడిషనల్ డైరెక్టర్ ఎం.గోపాల్ పాల్గొన్నారు.

క్షేత్ర స్థాయిలో చర్చించి నిర్ణయం తీసుకోవాలి

(మొదటి పేజీ తరువాయి..) తీసుకోవాలన్నారు. భూయజమానులకు ఏవైనా అభ్యంతరాలు ఉంటే అధికారుల సమక్షంలో నివృత్తి చేయాలని కోరారు. గ్రామంలోని కౌలు గుర్తింపు కార్డులు ఇచ్చిన డేటాను సంబంధిత మండల వ్యవసాయ శాఖ, రెవిన్యూ శాఖ, బ్యాంకులకు పంపాలన్నారు. పంట నమోదు కౌలు గుర్తింపు కార్డులు పొందిన కౌలు రైతులతో పాటు భూమి ఆన్‌లైన్లో లేకపోయిన రైతులను గుర్తించి పంట నమోదు చేయాలన్నారు. పంట నమోదు ఆధారంగా కౌలు రైతులకు పంట నష్టం, పంటల బీమా, ఇతర ప్రభుత్వ రాయితీ పథకాలు ఇవ్వాలన్నారు. భూమిని కౌలుకు ఇచ్చిన భూయజమాని, భూస్వామి పంట నమోదు చేయించుకోకూడదని తెలిపారు. కౌలు రైతును కాదని పంట నమోదును భూస్వాములు, భూయజమానులు చేయించుకుంటే కౌలు రైతులు మండల వ్యవసాయ అధికారి లేదా జిల్లా అధికారికి ఫిర్యాదు చేసే అవకాశం ఇవ్వాలన్నారు. దానిని అధికారులు ధ్రువీకరించి కౌలు రైతు పేరున పంట నమోదు చేయాలన్నారు. కౌలు గుర్తింపు కార్డులు పొందిన కౌలు రైతులందరికీ భూయజమాని బ్యాంకు రుణంతో సంబంధం లేకుండా పంట రుణాలు ఇవ్వాలని కోరారు. కౌలు రైతులకు అండగా ఉండేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు వి.రమణ పాల్గొన్నారు.

కెజిహెచ్ సెక్యూరిటీ గార్డులపై కక్షపూరిత చర్యలు తగవు



మాట్లాడుతున్న మణి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కెజిహెచ్‌లోని మహిళా సెక్యూరిటీ గార్డుల పట్ల ఆసుపత్రి సూపరింటెండెంట్ కక్షపూరితంగా వ్యవహరించడం మానుకోవాలని, వారికి బకాయి ఉన్న మూడు నెలల జీతాలను తక్షణం చెల్లించాలని జిల్లా వర్కింగ్ ఉమెన్ నాయకురాలు పి.మణి డిమాండ్ చేశారు. సోమవారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ నిద్రపోతున్న కెజిహెచ్ అధికారులు నిద్రలేవాలన్నారు. అక్రమాలకు పాల్పడుతున్న కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలన్నారు. సెక్యూరిటీ ఉద్యోగులకు రెండు నెలలు జీతాలు బకాయి ఉన్నారని, అక్టోబర్ నెలతో కలిపి మూడు మాసాల జీతం చెల్లించాలని తెలిపారు. జీతాల సమస్యలపై జిల్లా కలెక్టర్‌కు మూడు పర్యాయాలు విన్నవించినా పట్టించుకోలేదని తెలిపారు. కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినందుకు కాంట్రాక్టర్, కెజిహెచ్ సూపరింటెండెంట్ కార్మికులపై వేధింపులకు పాల్పడుతున్నారని విమర్శించారు. చట్టరీత్యా నేరమని తెలిసినా, పది మంది సమక్షంలో ఉద్యోగులు నుంచి తెల్ల కాగితంపై సంతకాలు తీసుకున్నారని, వాటిని కార్మికులకు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సూపరింటెండెంట్ మహిళా కార్మికులకుపై వ్యక్తిగతంగా ఎదురుదాడి చేయడం, కార్మికులు ఎవరెవరితో మాట్లాడుతూన్నారో తనకు తెలుసునని బ్లాక్ మెయిల్ చేయడం వంటి చర్యలపై మణి ఆవేదన వ్యక్తం చేశారు. సూపరింటెండెంట్‌ను జీతాలు ఇప్పించాలని అడిగితే, కలెక్టర్‌ను అడిగారు కదా.. ఆయనతోనే తేల్చుకోండి అని చెప్పడం అమానుషమన్నారు. కెజిహెచ్ సెక్యూరిటీ గార్డ్ యూనియన్ గౌరవ అధ్యక్షులు కర్రి చంద్రశేఖర్ మాట్లాడుతూ సూపరింటెండెంట్ కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జీతాలు ఆరు నెలలు ఇవ్వకపోయినా నోరు మూసుకొని పని చెయ్యాలని చెబుతున్న సూపరింటెండెంట్‌పై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పాత జీతాల బకాయిలు చెల్లించాలని, పిఎఫ్ ఇవ్వాలని అడిగిన శానిటేషన్ సెక్యూరిటీ గార్డును ఉద్యోగం నుంచి తొలగించారని, ఆమెను వెంటనే పాత జీతాలు చెల్లించి ఉద్యోగంలోకి తీసుకోవాలని కోరారు. మీడియా సమావేశంలో సిఐటియు నాయకులు ఎం.సుబ్బారావు, కెవిపి.చంద్రమౌళి, వై.రాజు పాల్గొన్నారు.

కళాశాల స్థలం ఆక్రమణకు మళ్లీ యత్నం

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల స్థలంలో అక్రమాలు స్వాధీనపరుచుకొని ప్రహరీ ఏర్పాటుచేసినా ఆక్రమణదారులు రెచ్చిపోతున్నారు. సర్వే నంబరు 276లో ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఇతర అవసరాలకు కేటాయించిన స్థలాన్ని ఇటీవల కొంతమంది ఆక్రమణకు పాల్పడడంతో రెవెన్యూ అధికారులు స్వాధీన పరుచుకొని కొంతమేర ప్రహరీ ఏర్పాటుచేశారు. ఆక్రమణదారులు మరలా కబ్జా చేసేందుకు పాగా వేస్తున్నారు. విషయం తెలుసుకున్న తహశీల్దార్ పేర్ల శ్యామ్‌ప్రసాద్, ఆర్ఐ ఉమాదేవి సోమవారం సాయంత్రం ప్రభుత్వ జూనియర్ కళాశాల స్థలాన్ని పరిశీలించారు. ఈ స్థలంలో ఎటువంటి పనులు చేపట్టరాదని, అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విమ్స్‌లో నేడు న్యూరో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - ఆరిలోవ : వరల్డ్ స్ట్రోక్‌డేను పురస్కరించుకొని విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో మంగళవారం న్యూరో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు. బ్రెయిన్ స్ట్రోక్, నరాల సమస్యలు, మూర్ఛ వ్యాధి, తలనొప్పి, పక్షవాతం, చిన్నపిల్లలకు మానసిక వైకల్యం తదితర రోగాలను నిర్ధారించే ఇఇజి, సీటీ స్కాన్ ఉచితంగా చేస్తామని పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1:00 వరకు ఓపి బ్లాక్‌లో ఈ వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు ప్రజలు వినియోగించుకొని కోరారు.

పిజిఆర్ఎస్‌కు 6 అర్జీలు

ప్రజాశక్తి - యంత్రాంగం

భీమునిపట్నం : స్థానిక జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థకు వివిధ సమస్యలపై ఆరు అర్జీలు అందాయి. జోనల్ కమిషనర్ పిల్లి ప్రేమ ప్రసన్న వాణి ఆయా అర్జీలను స్వీకరించి, తదుపరి చర్యల నిమిత్తం వాటిని ఆయా విభాగాల అధికారులకు పంపించారు. పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి రెండు, ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి 4 అర్జీలు అందాయి.

సీతమ్మధార : సీతమ్మధార అర్బన్ తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా వేదికకు 8 అర్జీలు వచ్చినట్లు తహశీల్దార్ రమేష్ తెలిపారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించేలా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. జివిఎంసి జోన్-3 కార్యాలయంలో నిర్వహించిన ప్రజావేదికకు నాలుగు అర్జీలు వచ్చినట్లు జోనల్ కమిషనర్ శివప్రసాద్ తెలిపారు.

మద్దిలో బంగారమ్మ ఉత్సవాలు

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని మద్ది గ్రామంలో ఆదివారం నుంచి బుధవారం వరకు బంగారమ్మ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. సోమవారం తొలి కార్యక్రమం, మంగళవారం అమ్మవారు ఉత్సవాలు సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. బుధవారం పండగ ముగుస్తుంది.

ఆర్‌టిసి బస్‌కాంప్లెక్స్ ఏర్పాటుచేయాలి : సిపిఐ

ప్రజాశక్తి- తగరపువలస : తగరపువలసలో ఆర్‌టిసి బస్ కాంప్లెక్స్ ఏర్పాటుకు వెంటనే చర్యలు చేపట్టాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక జిఆర్ భవన్‌లో పార్టీ భీమిలి ఏరియా సమితి సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆర్‌టిసి బస్ కాంప్లెక్స్ ఏర్పాటుపై స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ఇప్పటికే నిర్మాణం పూర్తి చేసుకున్న రైతు బజారులో మౌలిక సదుపాయాలు కల్పించి ప్రారంభించాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు ఎం.అప్పలరాజు, అల్లు బాబూరావు, కె.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కుంతీమాధవస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు

ప్రజాశక్తి- పద్మనాభం : శ్రీ అనంతపద్మనాభ స్వామి ప్రాంగణంలోని కుంతీ మాధవస్వామి ఆలయంలో ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు ఆలయ పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నామని ఈవో నానాజీ బాబు సోమవారం తెలిపారు. 29వ తేదీన పంచామృత అభిషేకం, నిత్య హోమం, స్వామివారికి పవిత్రాలు సమర్పణ కార్యక్రమాలు ఉంటాయని, 30వ తేదీన ప్రత్యేక పూజ పవిత్ర విసర్జన కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.

పవిత్రోత్సవాలకు రూ.15 వేలు వితరణ

పవిత్రోత్సవాల పూజా కార్యక్రమాల ఖర్చు నిమిత్తం రూపాకుల రవికుమార్ రూ.15 వేలు చెక్కును కమిటీ సభ్యులకు అందించారు.

నిబంధనలు పాటించకపోతే చర్యలు

ప్రజాశక్తి -ఆనందపురం : దీపావళి నేపథ్యంలో బాణాసంచా విక్రయాల్లో నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని ఆనందపురం సిఐ చింతా వాసునాయుడు హెచ్చరించారు. సోమవారం తమ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ, బాణాసంచా విక్రయాలకు అనుమతులు తప్పనిసరి అన్నారు. ఆనందపురం మండలం బోయపాలెంలో 4, ఆనందపురంలో 6 గురు బాణాసంచా విక్రయాలు జరిపేందుకు దరఖాస్తులు చేసుకున్నట్లు తెలిపారు. ఆనందపురం బీపీ కల్లాలు రోడ్డు శుభశ్రీ ఫంక్షన్ హాల్ ఎదురుగా ఖాళీ స్థలంలో బాణాసంచా విక్రయాలు ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నామన్నారు. బోయపాలెం బ్రిడ్జి సమీపంలో జన సమూహం లేని చోట విక్రయాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. బాణాసంచా విక్రయాల సమయంలో వ్యాపారులు జాగ్రత్తలు తీసుకోవాలని, సామగ్రి భద్రపరిచిన గొడౌన్లు, దుకాణాల వద్ద భద్రతా ప్రమాణాలు పాటించాలని వ్యాపారులకు ఆదేశించారు. ఇసుక, ఫైర్ ఇంజన్ తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలన్నారు. ఒక్కో దుకాణానికి 5 నుంచి 10 అడుగుల దూరం పాటించాలని, పరిమితికి మించి మందుగుండు సామగ్రి నిల్వ ఉంచరాదని పేర్కొన్నారు.

గురుకులంలో సైన్స్ ప్రదర్శన



సైన్స్ ప్రదర్శనను తిలకిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి -మధురవాడ : డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకులం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో జనత లెవెల్ 'ఫ్యూచరాన్- (సైన్స్ ఎగ్జిబిషన్) జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ సోమవారం ప్రారంభించారు. రెండు రోజుల పాటు జరిగే ఈ ఎగ్జిబిషన్‌లో ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి దాదాపు 33 పాఠశాలలకు చెందిన 150 మంది విద్యార్థులు పలు ప్రాజెక్టులను ప్రదర్శించారు. ప్రధానంగా నాలుగు అంశాలలో ఈ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. 'సైన్సు, సోషల్‌సైన్స్, మ్యాథ్స్, ఐసిటి' అనే అంశాల నుంచి జూనియర్, సీనియర్స్ విభాగాలుగా ప్రదర్శించారు. వీటితో పాటు చిత్రలేఖనం, హస్తకళలు (ఆర్ట్స్ /క్రాఫ్ట్స్) అంశాలలో కూడా ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ ఇటువంటి ప్రదర్శన వల్ల విద్యార్థులకు ఎంతో ఉపయోగం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డిసిఇఒ రూపావతి, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి పాల్గొన్నారు.

గిడిజాల పాఠశాలను సందర్శించిన ఎంపిడిఒ

ప్రజాశక్తి -ఆనందపురం: మండలంలోని గిడిజాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎంపిడిఒ వి.జానకి సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. సిఇఒ నారాయణమూర్తి ఆదేశాల మేరకు మధ్యాహ్న భోజనం పథకం పూర్తిస్థాయిలో అందుతున్నదీ, లేనిదీ పరిశీలించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించారు. సచివాలయాన్ని సందర్శించి సిబ్బందితో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ శినగం అప్పలరాజు, ఇంచార్జ్ కార్యదర్శి ధనుంజయ, స్థానిక నాయకులు కోరాడ వైకుంఠం తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు వేగవంతం

ప్రజాశక్తి -ఆనందపురం : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిమిత్తం ఓటర్ల నమోదును వేగవంతం చేయాలని ఎంఇఒ రవీంద్రబాబు పేర్కొన్నారు. మండలంలోని 11 జిల్లా పరిషత్ ఉన్నత, ఒక కేజీబీవీ పాఠశాలల్లో సుమారు 353 మంది ఉపాధ్యాయులు, జూనియర్ కళాశాలలో 16 మంది, 56 ప్రయివేట్ పాఠశాలల్లో 511 మంది ఉపాధ్యాయులు ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటు హక్కును నమోదు చేయడానికి అర్హులుగా ఉన్నారని, వీరు ఆన్‌లైన్ ద్వారా గాని ఆఫ్‌లైన్ ద్వారా గానీ నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

హెచ్ఐవి/ఎయిడ్స్‌పై అవగాహన

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సామాజిక ఆరోగ్య కేంద్రం ఐసిటిసి విభాగం ఆధ్వర్యాన సోమవారం విద్యార్థులకు హెచ్ఐవి/ఎయిడ్స్‌పై "మీకు తెలుసా" పేరిట అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐసిటిసి కౌన్సెలర్ రావి వెంకటరాజు మాట్లాడుతూ, హెచ్ఐవి/ఎయిడ్స్ ఎలా వస్తుంది? వ్యాధి లక్షణాలను వివరించారు. సుఖ వ్యాధులు, వాటి లక్షణాలను వివరించారు. హెచ్ఐవి పరీక్ష ఎవరైనా చేయించుకోవచ్చని, వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. వ్యాధి ఉంటే ఎఆర్‌టి మందులు అందజేస్తామని, తద్వారా జీవన ప్రమాణాలు పెంచుకోవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ సి.హెచ్.విష్ణుమూర్తి, అధ్యాపకులు వై.శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ విభాగం ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ప్రవీణ, డాక్టర్ ఎస్.అప్పలనాయుడు, ఎస్.శ్రీను, విద్యార్థులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఐసిటిసి కౌన్సెలర్ వెంకటరాజు

ఎపిఎస్ఇఎస్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - ఆరిలోవ : ఆంధ్రప్రదేశ్ స్కూల్ ఎడ్యుకేషన్ సర్వీసెస్ అసోసియేషన్ ఉమ్మడి విశాఖపట్నం జిల్లా నూతన కార్యవర్గ సభ్యులను జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం ఆవరణలో సోమవారం ఎన్నుకున్నారు. విశాఖ జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ ప్రత్యేక అతిథిగాను, ఎలక్షన్ అధికారిగా శ్రీకాకుళం ఎపిఎస్ఇఎస్ అసోసియేషన్ అధ్యక్షులు కె.రంగాచారి, ఎలక్షన్ ఆఫీసర్‌గా కె.ముత్యాలరావు, అబ్జర్వర్‌గా బి.శ్రీనివాసరావు వ్యవహరించారు. ఎపిఎస్ఇఎస్ ఉమ్మడి విశాఖ జిల్లా అసోసియేషన్ అధ్యక్షులుగా పి.ఆనందరెడ్డి, అసోసియేట్ అధ్యక్షునిగా కె.చంద్రధరరావు, సెక్రటరీగా కె.శ్రీనివాసనాయుడు, ఉపాధ్యక్షులుగా బి.బంగారమ్మ, వి.పెంటారావు, జి.జ్యోత్స్న అంబికాదేవి, ఎన్.మంగమ్మ, ఎం.శైలజ కుమారి, జనరల్ సెక్రటరీగా రామలింగేశ్వరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కె.సుందర్‌సింగ్ ఎన్నికయ్యారు.



ప్రమాణం చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

నేరాలు ఘోరాలు

మోదమాంబ ఆలయంలో చోరీ

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట మండలం విజయ రామరాజుపేట మోదమాంబ ఆలయంలో హుండీ, అమ్మవారి వెండి, బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు హుండీని పగలగొట్టి నగదు ఎత్తుకెళ్లిపోయారు. సోమవారం ఉదయం భక్తులు గుడికి వెళ్లేసరికి గర్భగుడి తలుపులు తెరుచుకుని ఉన్నాయి. ఈ చోరీపై గ్రామ పెద్దలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎఎస్ఐ ఎన్ భాస్కర్ సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు.

మద్యం సీసాలు స్వాధీనం

ప్రజాశక్తి-సీతమ్మధార : నర్సింహనగర్‌లోని అమెరికన్ బార్‌లో వెయిటర్‌గా పనిచేస్తున్న బంగారునాయుడు మద్యాన్ని అధిక ధరలు విక్రయిస్తున్నాడన్న సమాచారం మేరకు పోలీసులు అతని నుంచి 78 సీసాల మందును స్వాధీనం చేసుకున్నట్లు నాలుగో పట్టణ సిఐ ఎస్.విజయకుమార్ తెలిపారు. బంగారునాయుడును అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు.

మందుబాబులకు జరిమానా

ప్రజాశక్తి-ఆనందపురం, మధురవాడ : మద్యం తాగి పట్టుబడిన 10 మందికి జరిమానా విధిస్తూ భీమిలి మెట్రోపాలిటన్ జడ్జి తీర్పు ఇచ్చినట్లు ట్రాఫిక్ ఎస్ఐ పాపారావు తెలిపారు. ఆనందపురం పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం తాగి పట్టుబడిన 10 మందిపై కేసు నమోదు చేసి భీమిలి కోర్టుకు తరలించగా భీమిలి 15 అదనపు మెజిస్ట్రేట్ డి.సౌజన్య ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఐ పాపారావు మాట్లాడుతూ, మద్యం తాగి వాహనాలు నడిపిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

మధురవాడ : పోతిన మల్లయ్యపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనం నడిపిన వారికి అపరాధ రుసుం విధించినట్లు ట్రాఫిక్ ఎస్ఐ జి.ప్రసాద్ తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపిన 10మందిని కోర్టులో హాజరుపరచగా ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున అపరాధ రుసుము విధించినట్లు ఆయన తెలిపారు.

రెస్టారెంట్‌లో అగ్ని ప్రమాదం

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 97వ వార్డు పరిధి చినముసిడివాడ రాజ్యలక్ష్మి ఫంక్షన్ హాల్ రెండో అంతస్తులో సోమవారం సాయంత్రం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఒక్కసారి మంటలు రావడంతో సిబ్బంది భయాందోళనతో పరుగులు తీశారు. అక్కడున్న యువకులు పెందుర్తి పోలీసులకు సమాచారం అందించారు. సిఐ సతీష్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపుచేశారు. ప్రాణ నష్టం లేకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

క్రీడాకారులకు అభినందనలు

ప్రజాశక్తి -ఆనందపురం : ఎస్ఎంసి ఆధ్వర్యాన నిర్వహించిన క్రీడా పోటీల్లో మండలంలోని రామవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపిక కావడంతో వారిని పాఠశాలలో ఘనంగా సన్మానించారు. ఈ నెల 24వ తేదీ అనకాపల్లిలో జరిగిన జిల్లాస్థాయి బేస్‌బాల్ ఆటలు పోటీల్లో 11 మంది విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. 14 సంవత్సరాల బాలుర కేటగిరీలో ఒకరు, బాలికల కేటగిరిలో ముగ్గురు, 17 సంవత్సరాల లోపు బాలుర కేటగిరిలో నలుగురు, బాలికల కేటగిరిలో ముగ్గురు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. 26వ తేదీన భీమిలిలో జరిగిన సాఫ్ట్‌బాల్ పోటీల్లో బాలబాలికల 9 మంది ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఆయా విద్యార్థులను పాఠశాలలో సర్పంచ్ ఎర్ర పైడిరాజు ఆధ్వర్యాన సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నాగమణి, ఎస్ఎంసి చైర్మన్ రామచంద్రరాజు, పీడీ కె.నారాయణమూర్తి పాల్గొన్నారు.

పలుచోట్ల ఎల్ఐసి ఏజెంట్ల ధర్నాలు

ప్రజాశక్తి - యంత్రాంగం

విశాఖ కలెక్టరేట్ : పాలసీలపై బోనస్ పెంచాలని, జిఎస్‌టి రద్దు చేయాలని లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా విశాఖపట్నం డివిజనల్ అధ్యక్షులు బి.తిరుమలరావు, కార్యదర్శి ఎన్‌వియార్.వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం ఎల్ఐసి బిల్డింగ్ నూతన ప్రాంగణంలో యూనియన్ ఆధ్వర్యంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని పాలసీలపై ఏజెంట్ల కమిషన్‌ను పెంచాలన్నారు. పాలసీలను పాత పద్ధతిలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. మినిమమ్ రూ.లక్ష పాలసీని ప్రవేశ పెట్టాలని కోరారు. 55 సంవత్సరాల వయస్సు వరకు పాలసీలను ఇవ్వాలన్నారు. పాలసీదారుల లోనుపై వడ్డీలను తగ్గించాలన్నారు. గ్రూప్ ఇన్సూరెన్స్‌ను రూ.25 లక్షల వరకు పెంచాలని, ఏజెంట్లు అందరికీ మెడిక్లైమ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి డి.శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్: లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో స్థానిక ఎల్ఐసి కార్యాలయం ముందు ఏజెంట్ల ధర్నాను నిర్వహించారు. యూనియన్ ప్రెసిడెంట్ గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ, పాలసీల పై బోనస్ లు పెంచాలని, వీటిపై జి ఎస్టి రద్దు చేయాలన్నారు.అన్ని పాలసీల పై ఏజెంట్ల కమిషన్ పెంచాలని, ఏజెంట్ కమిషన్ పాత పద్ధతిలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. మినిమం ఒక లక్ష బీమాతో ప్రవేశపెట్టాలని, 55 సంవత్సరాల వయసు వరకు పాలసీ ఇవ్వాలని, పాలసీదారులకు లోన్ పై మెడిక్లైమ్ ఇవ్వాలన్నారు. కార్యదర్శి కూరాకుల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏజెంట్లు అందరికీ మెడి క్లైయిమ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి మాకిరెడ్డి అప్పలనాయుడు, ఏజెంట్లు తదితరులు పాల్గొన్నారు



విశాఖలోని ఎల్ఐసి కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఏజెంట్లు

గాజువాక : ఎల్ఐసి ఏజెంట్లకు ఆర్థికంగా నష్టానికి గురిచేసే చర్యలను విరమించాలని కోరుతూ గాజువాక ఎల్ఐసి బిల్డింగ్ ఎదురుగా ఏజెంట్లు సోమవారం నిరసన తెలిపారు. దేశవ్యాప్తంగా లైఫ్ ఇన్సూరెన్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పిలుపు మేరకు చేపట్టిన నిరసనకు టిఎన్‌టియుసి బలిరెడ్డి సత్యనారాయణ సంఘీభావం తెలిపారు. ఎల్ఐసి యాజమాన్యం పాలసీలను పాత పద్ధతిలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గాజువాక బ్రాంచ్ ఎల్ఐసి ఏజెంట్ల అసోసియేషన్ అధ్యక్షులు పల్లి అప్పలనాయుడు, కార్యదర్శి అమర పిన్ని రమణ, నాయకులు పొట్నూరు నాగేంద్రరావు, ఎల్.వరల్డ్ రావు, పిల్లా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ డెయిరీ ఆక్రమించిన స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలి

ప్రజాశక్తి -గాజువాక : విశాఖ డెయిరీ యాజమాన్యం ఆక్రమించిన మూడెకరాల బంజరు భూమిని స్వాధీనం చేసుకోవాలని సోమవారం స్పందనలో జిల్లా కలెక్టర్‌కు సిపిఎం నాయకులు ఎ.లోకేశ్వరరావు, వనమాల అప్పలరాజు, వైసిపి నాయకులు వరదాడ వెంకటరమణ, గ్రామ పెద్దలు ఎస్.అప్పలరాజు కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సంత స్థలాన్ని స్వాధీనం చేసుకుని ఆటస్థలంగా అభివృద్ధి చేయాలని కోరారు. గాజువాక మండలం, 68వ వార్డు పరిధి మింది రెవెన్యూ తాలూకా అక్కిరెడ్డిపాలెం శివారు సర్వే నంబర్ 47/3 ఉన్న మూడెకరాల బంజరు సంత స్థలాన్ని విశాఖ డెయిరీ యాజమాన్యం ఆక్రమించి ప్రహరీ నిర్మించిందని వివరించారు. ఈ స్థలం విషయమై గతంలో పోరాటం చేసామని తెలిపారు. ఇప్పటికే విశాఖ డెయిరీ వల్ల జల, వాయు కాలుష్యం తప్ప తమ గ్రామ అభివృద్ధికి ఏ విధమైన సహకారమూ లేదని పేర్కొన్నారు.


ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

డ్వాక్రా మార్కెట్ ఎగ్జిబిషన్ ప్రారంభం

ప్రజాశక్తి- ములగాడ : జివిఎంసి 60వ వార్డు పరిధి కోరమండల్ శ్రీహరిపురం ఎఫ్ఆర్‌యు ఆస్పత్రిలో మెప్మా ఆధ్వర్యాన అర్బన్ మార్కెట్ డ్వాక్రా గ్రూపులో మహిళల తయారు చేసిన ఉత్పత్తులతో ఏర్పాటుచేసిన ఎగ్జిబిషన్‌ను సోమవారం పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహిళల కోసం ప్రభుత్వం ఎన్నో పథకాలు తెచ్చిందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సోమేష్, మాలినాయుడు, నేలాపు జోజి, రాము కోరాడ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

శాప్ చైర్మన్‌ను కలిసిన బాలునాయుడు

ప్రజాశక్తి -గాజువాక : రాష్ట్ర క్రీడా సాధికారిక సంస్థ చైర్మన్ (శాప్) అనిమిని రవినాయుడును గాజువాక నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు బలగ బాలునాయుడు తిరుపతిలో మర్యాదపూర్వకంగా సోమవారం కలిశారు. గాజువాక నియోజకవర్గంలో ఉన్న క్రీడా మైదానాలు, క్రీడాకారుల సమస్యలను వివరించారు. ఉడా ఆదర్శ మైదానం, పెదగంట్యాడ స్టేడియానికి నిధులు కేటాయించి నిర్మాణాలు పూర్తయ్యేలా సహాయ సహకారాలు అందించాలని కోరారు. 65వ వార్డు వికాస్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నూతనంగా ఏర్పాటుచేసిన ఈతకొలను ప్రారంభోత్సవానికి రావాలని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో 65వ వార్డు సెక్రటరీ కర్రీ కృష్ణ, 73వ వార్డు బీసీ నాయకులు బగ్గు రాజారావు, కొలగాని శ్రీను, బీరకా శంకర్, యువ నాయకులు నెహ్రూ ,రమేష్ , శేఖర్ పాల్గొన్నారు.

బాణసంచా దుకాణాల పరిశీలన

ప్రజాశక్తి-సీతమ్మధార : పోర్టు స్టేడియం వెనుక ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలను సోమవారం ద్వారక ఎసిపి లక్ష్మణమూర్తి పరిశీలించారు. అగ్నిమాపక, విద్యుత్తుశాఖ అధికారుల పరిశీలన అనంతరం జివిఎంసి, పోలీసు అధికారులు పరిశీలించి అనుమతులు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. నిబంధనకు అనుగుణంగా స్టాళ్లను నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో సిఐ ఎస్.విజయకుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

వీధి దీపాలపై వినతి

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి 8వ వార్డు పరిధి పాత మధురవాడ ప్రాంతంలో వీధిలైట్లు వెలగక ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని సిపిఐ మధురవాడ ఏరియా సమితి ఆధ్వర్యాన జోన్ 2 కమిషనర్‌కు సోమవారం వినతి పత్రం అందించారు. 7వ వార్డు పరిధి చంద్రంపాలెంలో వీధి దీపాలు వెలగక ఇబ్బందులు పడుతున్నట్లు సిపిఐ మధురవాడ ఏరియాకార్యదర్శి వి.సత్యనారాయణ వివరించారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం నాయకులు ఎం.ఎ.బేగం, కె.అరుణ్‌కుమార్, పి.రమణ, అప్పారావు, రమణ, తదితరులు పాల్గొన్నారు.

సురక్షితంగా దీపావళి జరుపుకోవాలి

డాక్టర్ శిల్పా తారిణి



ప్రజాశక్తి - ఆరిలోవ : ఆనందదాయకమైన దీపావళిని సురక్షితంగా జరుపుకోవాలంటే ప్రతి ఒక్కరూ బాధ్యతగా ప్రవర్తించాలని ఎల్.వి.ప్రసాద్ కంటి వైద్య నిపుణులు డాక్టర్ శిల్పా తారిణి తెలిపారు. దీపావళి రోజున మందుగుండు సామగ్రిని కాల్చే సమయంలో ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, ఒక వేళ ప్రమాదాలు జరిగితే వైద్య నిపుణుల సంప్రదించడం వంటి విషయాలను వివరించారు. పండగ సమయంలో కాలిన గాయాల కేసులు పెరుగుతున్నాయన్నారు. జాగ్రత్తలు పాటించడం ద్వారా నివారించవచ్చని చెప్పారు. చిన్న పిల్లలను టపాసులతో ఒంటరిగా వదిలి పెట్టకూడదని, సింథటిక్ కంటే కాటన్ దుస్తులు ధరిస్తే మంచిదని, టపాసులు కాల్చడానికి బహిరంగ ప్రదేశాలను ఎంచుకోవడం ఉత్తమం అని వివరించారు. కంటికి ఏమైనా గాయమైతే వెంటనే సంబంధిత వైద్యనిపుణులను సంప్రదించాలని సూచించారు. టపాసులు కాల్చే సమయంలో దగ్గరలో రెండు బక్కెట్ల నీరు ఉంచుకోవడం మంచిదన్నారు. చేతితో టపాకాయలను వెలిగించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఒకవేళ కంటికి గాయమైతే కంటిమీద ఎటువంటి ఒత్తిడి పెట్టకూడదని, దాన్ని ముట్టుకోవడం, నలపడం చేయకూడదని వివరించారు.

వైసిపి హయాంలో దోపిడీ - వంశీకృష్ణ శ్రీనివాస్

ప్రజాశక్తి-సీతమ్మధార : గత వైసిపి ప్రభుత్వం అన్ని విధాలుగా దోపిడీకి పాల్పడిందని దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే , జనసేన విశాఖ నగర అధ్యక్షుడు వంశీకృష్ణ శ్రీనివాస్ ఆరోపించారు. సీతంపేటలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మాజీ సిఎం జగన్మోహన్‌రెడ్డి ఈ మధ్య కాలంలో మీడియాలో ఎక్కువగా కనిపిస్తున్నారని, అధికారంలో ఉన్నప్పుడు మీడియా ముందుకు రాలేదని ఎద్దేవాచేశారు. మిథున్ రెడ్డి ద్వారా జరిగిన కుంభకోణాలపై విచారణ చేయాలని సిఎంను కోరారు. ప్లాస్టిక్ నవ్వులతో ప్రజలను మోసం చేసిన జగన్‌కు తల్లి, చెల్లి లెక్క లేదన్నారు. విజయసాయిరెడ్డిని కూడా వాడుకుని వదిలేస్తారని పేర్కొన్నారు. మాజీ ఎంపీ ఎంవివి.సత్యనారాయణ, కాటారాజు కబ్జాకోరులని ఆరోపించారు. జివిఎంసి జోన్-3ని జోన్-2లోకి మారుస్తామని తెలిపారు. విక్టోరియా ఆస్పత్రిని కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేస్తామని చెప్పారు.

కష్టపడి పనిచేసేవారికి గుర్తింపు

ప్రజాశక్తి -గాజువాక : కష్టపడి పని చేసే వారికి తెలుగుదేశం పార్టీలో గుర్తింపు లభిస్తుందని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు పులి రమణారెడ్డి అన్నారు. జివిఎంసి 75వ వార్డు పరిధి నెల్లిముక్కులో సోమవారం తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కార్యకర్తలే పార్టీకి ముఖ్యమని అధినేత చంద్రబాబు చెబుతున్న విషయాన్ని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసరావు, పెద్దాడ సోమునాయుడు, గోక్యాడ ముత్యాలు, ములకలపల్లి పెంటయ్య, ఉరుకూటి అప్పలరాజు, పులి శ్రీరామరెడ్డి, చినపెంటయ్య పాల్గొన్నారు.

సామాజిక చైతన్యం ద్వారానే సైబర్ నేరాల అదుపు

ప్రజాశక్తి -మధురవాడ : సామాజిక మాధ్యమాల ద్వారా వ్యక్తిగత సమాచారం సైబర్ నేరగాళ్ల చేతికి చేరుతోందని, సామాజిక చైతన్యం ద్వారానే ఈ తరహా సైబర్ నేరాలను అదుపు చేయడం సాధ్యపడుతుందని విశాఖ ఎంపీ, గీతం అధ్యక్షుడు ఎమ్.శ్రీభరత్ పేర్కొన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం మహిళ సాధికారిక విభాగం, టెక్‌మాంత్రిక్ ఐటి సంస్థ సంయుక్తంగా సోమవారం నిర్వహించిన ఉమెన్ అండ్ టెక్నాలజీ సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. సాంకేతికంగా అభివృద్ధి సాధిస్తున్నప్పటికీ నేరపూరిత స్వభావం, మనుషుల మధ్య నమ్మకం సన్నగిల్లి ప్రతి ఒక్కరినీ అనుమానంగా చూడటం పెరుగుతోందన్నారు. సాంకేతికంగా విద్యావంతులైన మహిళలు సైబర్ నేరాల పట్ల అవగాహన, పెంచడంతో పాటు నేరస్తులపై చట్ట ప్రకారం శిక్షలు పడే వరకు సామాజిక కార్యకర్తలుగా తమ వంతు కృషి చేయాలని సూచించారు.

విశాఖ నగర పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగ్చీ మాట్లాడుతూ అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వాటిలో అధిక శాతం సైబర్ నేరాలకు పాల్పడే వ్యక్తులకు చెందినవిగా గుర్తించామని చెప్పారు. సామాజిక మాధ్యమాల ద్వారా కీలకమైన సమాచారాన్ని ముఖ్యంగా పాస్‌వర్డ్‌లు, చిత్రాలు వంటివి ఎవరితోనూ పంచుకోవద్దని సూచించారు. సైబర్ నేరస్తులు ఒంటరి మహిళలను, యువతను, నిరుద్యోగులను లక్ష్యంగా చేసుకుని నేరాలకు పాల్పడుతున్నారని వెల్లడించారు. ఆన్‌లైన్ మోసాలకు గురైనవారు వెంటనే పోలీసు శాఖకు సమాచారం అందించాలని సూచించారు.

సింబయాసిస్ అధినేత ఒ.నరేష్‌కుమార్ మాట్లాడుతూ ఇంటర్‌నెట్ యూజర్ల వ్యక్తిగత సమాచార గోప్యతను పాటించాలని, ఎలాంటి వివరాలు సామాజిక మాధ్యమాల పంచుకోవాలో తెలిసి ఉండాలని చెప్పారు. సైబర్ సెక్యూరిటీ అంశాలను నేటి తరం యువత నేర్చుకోవాలన్నారు. హిందూ దిన పత్రిక రెసిడెంట్ ఎడిటర్ సుమిత్ భట్టాచార్య మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల ప్రజల కంటే చదువుకున్న వారే సైబర్ నేరాల బారిన పడుతున్నారని పేర్కొన్నారు. గీతం ఇఇసిఇ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ బి.రాజేష్‌కుమార్ మాట్లాడుతూ డిజిటల్ ఉపకరణాల వినియోగంలో పడి వ్యక్తిగత సమాచార గోప్యత పాటించడం మరిచిపోతున్నామన్నారు. కార్యక్రమంలో టెక్ మాంత్రిక్ సిఇఒ సూర్య, గీతం మహిళా సాధికారిక విభాగం అధ్యక్షులు డాక్టర్ వి.బి.శ్రీవిద్య, ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి, జిఎస్‌సర్ సైకాలజి విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ వి.నివేదిత, గీతం న్యాయ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్.చిత్ర సక్సేన, పాలసి ఎనలిస్ట్ ఓషిన్ పి.సహారే, ఆంధ్రప్రదేశ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజి అసోసియేషన్ అధ్యక్షులు ఎమ్.లక్ష్మి, ఎమ్.జె.శ్రీకాంత్ పాల్గొని వివిధ చట్టాలపై ప్రసంగించారు.

వాట్ సదస్సులో విశాఖ ఎంపీ శ్రీభరత్



వాట్ సదస్సులో మాట్లాడుతున్న విశాఖ ఎంపీ శ్రీభరత్

పాల సేకరణ ధర తగ్గింపుపై

నేటి మహాధర్నాను జయప్రదం చేయండి

పాల కేంద్రాల వద్ద విస్తృత ప్రచారం

ప్రజాశక్తి-అచ్యుతాపురం

విజయ విశాఖ డెయిరీ ఆవు పాలు సేకరణ ధర లీటర్ రూ.3 తగ్గించడాన్ని నిరసిస్తూ మంగళవారం గాజువాకలోని విశాఖ డెయిరీ వద్ద జరగనున్న మహాధర్నాకు రైతులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఏపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు పిలుపునిచ్చారు. ఈ మేరకు మండలంలోని తిమ్మరాజుపేట పాల కేంద్రం ఆవరణలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ లీటరు లీటరు వాటర్ బాటిల్ రూ.20 పలుకుతుండగా, లీటర్ పాలుకు రూ.23 చెల్లించడం దారుణమన్నారు. నేటి రైతాంగం వ్యవసాయాన్ని విడిచిపెట్టి భూములను పశు పోషణకు కావాల్సిన గడ్డి నాటడానికే కేటాయిస్తున్నారని, ఇలాంటి సమయంలో రైతన్నకు బాసటగా నిలవాల్సిన విశాఖ డెయిరీ, పాల సేకరణ తగ్గించడం దారుణమన్నారు. తక్షణమే తగ్గించిన పాల సేకరణ ధరను పెంచాలని, పెంచిన పశుదాన ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. విశాఖ డెయిరీలో జరుగుతున్న అవకతవకలపై విచారణ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ కౌలు రైతుల సంఘం జిల్లా ప్రతినిధి కాంగ్రేసుల రామ సదాశివరావు, ఆడారి అర్జున్, శరగడం సోమునాయుడు, బీసెట్టి రమణబాబు, వెలగా అచ్చం నాయుడు, ఎస్.రాము పాల్గొన్నారు.

చోడవరం : విశాఖ డెయిరీ తగ్గించిన పాల ధరను వెంటనే పెంచాలని కోరుతూ జరుగు మహాధర్నాపై ముద్రించిన పోస్టర్‌ను వి.మాడుగుల మండలం వీరనారాయణంలో ఆవిష్కరించారు. ఈసందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి ఇరట నరసింహమూర్తి మాట్లాడుతూ ఆవుపాలకు లీటరకు రూ.50, గేదె పాలకు రూ.100 చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.



వీరనారాయణం పాల కేంద్రం వద్ద పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం నేత, రైతులు

చోడవరం : విశాఖ డెయిరీ వద్ద మంగళవారం జరుగు మహాధర్నను విజయవంతం చేయాలని కోరుతూ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎస్వీ నాయుడు మండలంలోని వెంకన్నపాలెం, గజపతినగరం, జుత్తాడ, లక్కవరం, దుడ్డుపాలెం, నర్సాపురం, అన్నవరం తదితర గ్రామాల్లో సోమవారం ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పెరగడం అప్పారావు, పీల రామప్ప నాయుడు, చొప్ప వెంకట అప్పారావు పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని బయ్యవరం పాల కేంద్రం వద్ద పాల రైతులు విశాఖ డెయిరీ తగ్గించిన ఆవు పాల ధర వెంటనే పునరుద్ధరించాలని కోరుతూ నిరసన తెలిపారు. పాడి రైతులకు నష్టం కలిగించే విధంగా నిర్ణయాలు తీసుకోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో జి.ప్రసాద్, జి.నాగమణి, లోవరాజు, మనీగ్రేస్, జి.ఈశ్వరరావు, సురేంద్ర, ఎన్.వెంకటేశ్వరరావు, పాల రైతు సంఘం నాయకులు డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కె.కోటపాడు : మహ ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ సోమవారం కోటపాడులో సిపిఎం నాయకులు పోస్టర్‌ను విడుదల చేశారు. సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్ శంకరరావు మాట్లాడుతూ రైతులతో సంప్రదించకుండా ఏకపక్షంగా పాల సేకరణ ధర తగ్గించడం సరికాదన్నారు. గత రెండేళ్లగా పాడి రైతులకు బోనస్ ఇవ్వకుండా యాజమాన్యం తీవ్ర ద్రోహం చేసిందని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గండి నాయనబాబు, యర్రా దేముడు, రామలక్ష్మి, వి.సూర్యనారాయణ గాడి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పాల సేకరణ ధర తగ్గించడం సమంజసం కాదు

చోడవరం : విశాఖ డెయిరీ యాజమాన్యం పాల సేకరణ ధర తగ్గించడం ఏమాత్రం సమంజసం కాదని, తగ్గించిన దానితోపాటు అదనపు ధర రైతులకు ఇవ్వాలని జనసేన చోడవరం నియోజకవర్గం ఇన్‌ఛార్జి పివిఎస్ఎన్.రాజు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ డెయిరీ రైతులకు విక్రయిస్తున్న ఉత్పత్తులన్నీ పెంచుకుంటూ పోతూ, పాల సేకరణ ధర ఎందుకు తగ్గిస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. రైతులు చేస్తున్న పోరాటానికి మద్దతు ఇస్తున్నట్లు రాజు తెలిపారు.

స్విమ్మింగ్ పోటీల్లో మధుబాబుకు బంగారు పతకాలు

ప్రజాశక్తి-కశింకోట : గుంటూరులో స్విమ్మింగ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి మాస్టర్ లెవెల్ ఛాంపియన్ షిప్ స్విమ్మింగ్ పోటీల్లో కశింకోట పోలీసు స్టేషన్ హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న జి.మధుబాబు బంగారు పతకాలు సాధించారు. ఈ పోటీల్లో 400, 200 మీటర్ల ఫ్రీస్టైల్ విభాగాల్లో రెండు గోల్డ్ మెడల్స్, 100 మీటర్ల బటర్ ఫ్లై, బ్యాక్ స్ట్రోక్ విభాగంలో రెండు సిల్వర్ మెడల్స్ సాధించారు. మధ్యప్రదేశ్ భూపాల్లో జరగబోయే జాతీయస్థాయి మాస్టర్ స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ మేరకు మధుబాబును జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా సోమవారం అభినందించారు.

రాష్ట్రస్థాయి క్యారమ్స్ పోటీలకు డిపిఎన్ విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి- కశింకోట : విశాఖపట్నం సీతామ్మధార శారదా విద్యా నిలయం హైస్కూల్లో జరిగిన 68వ ఉమ్మడి జిల్లాల క్యారమ్స్ పోటీలలో కశింకోట డిపిఎన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ప్రేమబత్తుల యస్వంత్ అండర్-17 బాలుర విభాగంలో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ మేరకు యస్వంత్‌కు పాఠశాల హెచ్ఎం ఎంఆర్‌వి.అప్పారావు, ఇంచార్జి హెచ్ఎం ఆచంట రవి, పాఠశాల విద్యా కమిటీ ఛైర్మెన్ నక్కా నాగమణి, వ్యాయామ ఉపాధ్యాయుడు వి.ప్రభాకర్, ఉపాధ్యాయ బృందం సోమవారం అభినందనలు తెలిపారు.

యోగా పోటీల్లో శ్రీకృష్ణ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-అనకాపల్లి : ఏపి యోగ అసోసియేషన్ ఆధ్వర్యంలో నంద్యాలలో నిర్వహించిన 37 ఏపీ స్టేట్ యోగాసన ఛాంపియన షిప్ - 2024 పోటీలలో తుమ్మపాల శ్రీకృష్ణ యోగా సెంటర్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ సెంటర్ నుండి నలుగురు పాల్గొనగా, బి.దేవన్ననాయుడు 8-14 ఏజ్ గ్రూప్‌లో ద్వితీయ బహుమతి, జి.విశ్వశ్రీ నాలుగో బహుమతి, 50-60 ఏజ్ గ్రూప్‌లో బి.నాగమణి నాలుగో బహుమతి, 60పైబడిన ఏజ్ గ్రూపులో బి.నరసింగరావు ప్రథమ బహుమతి సాధించారు. డిసెంబర్ 28, 29న జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు వీరు అర్హత సాధించారు. వీరిని మాజీ సర్పంచ్ కర్రి బాబి, ఎస్వీఎస్ కార్యదర్శి కర్రి జోగి నాయుడు, గ్రామ నాయకులు నడిపల్లి గణేష్, బోసు బాబు, యమ్.అజయ్, చంటి, శ్రీను, సూరిబాబు, గణేష్, సింహాచలం, ఆర్టీసీ సత్యనారాయణ అభినందించారు.

కరాటేతో ఆత్మరక్షణ పొందవచ్చు

ప్రజాశక్తి-సబ్బవరం : కరాటే నేర్చుకుంటే ఆత్మరక్షణ పొందవచ్చని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. జీవీఎంసీ 95వ వార్డు వరలక్ష్మీనగర్ కాపు కళ్యాణ మండపంలో శ్రీగంటా కనకారావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్ స్టేట్ కరాటే ఛాంపియన్ షిప్-2024 పోటీలను సోమవారం ఎమ్మెల్యే రమేష్ బాబు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ పోటీల్లో ఆరు రాష్ట్రాలకు చెందిన సుమారు 600 మంది కరాటే క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గం నాయకులు బలిరెడ్డి అప్పారావు, పిల్లా జగన్మోహన్ పాత్రుడు, బలిరెడ్డి రామకృష్ణ, గండి దుర్గాప్రసాద్, కర్రి కనకరాజు, పి మంగరాజు పాల్గొన్నారు.

విద్యుత్ భారాలపై సిపిఐ నిరసన

ప్రజాశక్తి-అనకాపల్లి : ఎఫ్‌పిపిసిఎ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై రూ.6072 కోట్ల భారం మోపడంపై సిపిఐ ఆధ్వర్యాన స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు మాట్లాడుతూ అధికారంలోకి వస్తే ప్రజలపై ఎలాంటి విద్యుత్తు భారం మోపమని చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కేఎస్.సన్యాసిరావు, రెడ్డిపల్లి అప్పలరాజు, వైఎన్.భద్రం, ఫణీంద్ర కన్నబాబు, వియ్యపురాజు, కోరిబిల్లి శంకర్రావు, పోతురాజు, వీరాచారి, త్రినాథ్, శ్రీను, సత్తిబాబు, పాల్గొన్నారు.

యూరియా సరఫరా

ప్రజాశక్తి-అనకాపల్లి : మండలంలోని తుమ్మపాల గ్రామంలో రైతులకు జనసేన పార్టీ ఇంచార్జ్ భీమరశెట్టి రాంకీ ప్రోత్సాహంతో సోమవారం యూరియా సరఫరా చేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు చదరం నాగేశ్వరరావు, గ్రామ సర్పంచ్ తట్ట పెంటయ్య నాయుడు, పీలా తాతు నాయుడు, పీలా విశ్వేశ్వరరావు, చదరం అర్జునాయుడు, కన్నారావు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి-యలమంచిలి : యలమంచిలి మున్సిపల్ కౌన్సిల్ సమావేశం మంగళవారం జరుగుతుందని కమిషనర్ ప్రసాదరాజు తెలిపారు. ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో జరిగే సమావేశానికి చెర్‌పర్సన్ రమాకుమారి అధ్యక్షత వహిస్తారని, అధికార్లు, కౌన్సిలర్లు హాజరుకావాలని కోరారు.

నేడు ఇఎస్ఐ హాస్పిటల్ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-అచ్యుతాపురం : ప్రత్యేక ఆర్థిక మండలి పరిధిలో ఏపీఐఐసీ కార్యాలయానికి సమీపంలో ఐదు ఎకరాల విస్తీర్ణంలో నిర్మించి తలపెట్టిన 30 పడకల ఈఎస్ఐ హాస్పటల్ భవన నిర్మాణ పనులకు మంగళవారం ఉదయం 11.30 గంటలకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేతుల మీదుగా వర్చువల్ పద్ధతిలో శంకుస్థాపన జరగనుంది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, జిల్లా ఇన్చార్జి మంత్రి కొల్లు రవీంద్ర హెూంమంత్రి వంగలపూడి అనిత ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ తదితరులు పాల్గొంటారు. ఈ మేరకు సిఐ నమ్మి గణేష్, జనసేన మండల శాఖ అధ్యక్షులు బి రాందాస్, ఈఎస్ఐ చంద్రరావు సోమవారం సభా ప్రాంగణ ఏర్పాట్లను పరిశీలించారు.

పరిశోధన రంగంపై దృష్టి పెట్టాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : ఇంజనీరింగ్ విద్యార్థులు సాఫ్ట్వేర్ రంగంతో పాటు పరిశోధన అభివృద్ధి రంగంలో కూడా ముందుకు సాగాలని ఎల్‌సిట్ గ్రూప్ డైరెక్టర్ డాక్టర్ జి.అప్పన్న పేర్కొన్నారు. స్థానిక డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం డిపార్ట్మెంట్ డే వేడుకలు కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా జి. అప్పన్న, శ్రీహరికోట స్పేస్ సెంటర్ శాస్త్రవేత్త సతీష్ ధావన్ హాజరయ్యారు. జి.అప్పన్న మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో కూడిన ఉపగ్రహం తయారు చేసి అగ్ర దేశాలతో పోటీ పడుతున్నందుకు మనం అందరం గర్వ పడాలన్నారు. అనంతరం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ట్రెండ్స్ ఇన్ రీసెర్చ్ ఇన్నోవేషన్స్ పుస్తకాన్ని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ దాడి రత్నాకర్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. వైకుంఠరావు, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ కె. సుజాత, విద్యార్థులు అధ్యాపకులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనుల్లో అవకతవకలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : చిన్న నాలుగు రోడ్డు జంక్షన్ నుండి గాంధీ బొమ్మ జంక్షన్ వరకు రోడ్డు విస్తరణ పనుల్లో అవకతవకలు అక్రమాలు జరిగాయని, ఇందుకు కారకులైనా అప్పటి టౌన్ ప్లానింగ్ అధికారి జనార్దన్‌పై చర్యలు తీసుకోవాలని టిడిపి పార్లమెంటరీ నియోజకవర్గం మీడియా కోఆర్డినేటర్ కొణతాల వెంకటరావు డిమాండ్ చేశారు. స్థానిక విలేకర్లతో సోమవారం ఆయన మాట్లాడుతూ రోడ్డు డిజైన్ భవన యజమాను నుండి డబ్బులు వసూలు చేసుకుని రోడ్డును అష్టవంకర్లు చేయడానికి కారణమైన జనార్దన్‌పై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పి నారాయణ కు లేఖ రాశామని తెలిపారు. సమావేశంలో టిడిపి నాయకులు కాంగ్రేగుల సత్యనారాయణ, పిళ్ళా తారకేష్ పాల్గొన్నారు.

అభిజిత్ పరిశ్రమను తెరవాలి

కంపెనీ గేటు వద్ద సిఐటియు ఆధ్వర్యంలో నిరసన



అభిజిత్ కంపెనీ గేట్ ముందు ఆందోళన చేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి-అచ్యుతాపురం

అభిజిత్ యాజమాన్యం లే ఆఫ్‌ను ఎత్తివేసి తక్షణమే పరిశ్రమను తెరవాలని కోరుతూ సోమవారం కంపెనీ ప్రధాన గేటు వద్ద సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. ఉపాధి కోల్పోయిన వందలాది మంది కార్మికులు ఇందులో పాల్గొని యాజమాన్యానికి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ అభిజిత్ పరిశ్రమను మూసి వేసి నేటికీ 14 రోజులైందని, వెయ్యి మంది కార్మికులు ఉపాధి కోల్పోయారని తెలిపారు. కార్మికులు గోడును యాజమాన్యం పట్టించుకోలేదన్నారు. యాజమాన్యం నిబంధనలకు వ్యతిరేకంగా అక్రమంగా లే ఆఫ్ ప్రకటించిందని, నిబంధనలకు వ్యతిరేకంగా పరిశ్రమను మూసివేసిన యాజమాన్యంపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. యాజమాన్యాన్ని వెంటనే అరెస్టు చేయాలని, పరిశ్రమను పునఃప్రారంభించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్మికులకు రావలసిన బకాయి వేతనాలు, బోనస్ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నుండి కోట్లాది రూపాయలు రాయితీలు పొందుతున్న పరిశ్రమ యజమానులు కార్మికులకు అన్యాయం చేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ రాము, మండల కన్వీనర్ కె సోమునాయుడు, పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

రీ సర్వేలో అవకతవకలను సరిచేయాలి

సిపిఎం జిల్లా నేత వెంకన్న

ప్రజాశక్తి-కె.కోటపాడు

జగనన్న భూ రీ సర్వేలో పలు అవకతవకలు జరిగాయని, అధిక శాతం రైతులకు నష్టం జరిగిందని, వాటిని సరి చేసి రైతుకు సరైన పట్టాదారు పాసుపుస్తకాలు అందించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న డిమాండ్ చేశారు. స్థానిక సిఐటియు కార్యక్రమంలో సిపిఎం మండల మహాసభ సోమవారం జరిగింది. ఇందులో పాల్గొన్న వెంకన్న మాట్లాడుతూ విశాఖ డెయిరీ తగ్గించిన పాల సేకరణ ధరలు పెంచాలని డిమాండ్ చేశారు. చోడవరం చక్కెర ఫ్యాక్టరీలో పూర్తి స్థాయిలో క్రషింగ్ చేయాలని, రైతుకు టన్నుకు రూ.4000 ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు.

సిపిఎం మండల కన్వీనర్‌గా ముత్యాలనాయుడు



సిపిఎం మండల కన్వీనర్ ముత్యాలనాయుడు

ఈ మహాసభలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. సిపిఎం మండల కన్వీనర్‌గా ఆర్ ముత్యాల నాయుడు, కమిటీ సభ్యులుగా ఎర్ర దేవుడు, ఈర్ల నాయుడు బాబు, గాడి ప్రసాద్, వై దేవుడమ్మ, పి.రామలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్.శంకర్రావు పాల్గొన్నారు.

అక్రమ కేసులు ఎత్తివేతకు ప్రయత్నం

కూటమి కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో మంత్రి రవీంద్ర

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

గత ప్రభుత్వంలో టిడిపి కూటమి కార్యకర్తలపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయడానికి ప్రయత్నిస్తానని రాష్ట్ర గనులు, భూగర్భ, ఎక్సైజ్‌శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. పార్టీకి సేవలందించిన వారికి త్వరలో నామినేటెడ్ పదవులు కూడా ఇవ్వనున్నట్లు తెలిపారు. అనకాపల్లిలో సోమవారం జరిగిన టిడిపి, జనసేన, బిజెపి కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో జరిగిన భూ దోపిడీని బయటకు తీసి చర్యలు తీసుకుంటామన్నారు. రాబోయే నీటి సంఘాలు, కో ఆపరేటివ్ ఎన్నికల్లో కార్యకర్తలు పనిచేయాలని సూచించారు. ప్రతీ నియోజకవర్గంలో వంద ఎకరాల్లో టిడిపి, జనసేన, బిజెపి కార్యకర్తలు చిన్నచిన్న యూనిట్లు పెట్టుకొనేలా ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచిస్తున్నారని పేర్కొన్నారు. రెండేళ్లలో ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ కార్యాలయం పూర్తి చేయడానికి కృషి చేస్తామన్నారు. పరిశ్రమల్లో స్థానికులకు ఉపాధి కల్పనపై సమన్వయంతో పనిచేద్దామన్నారు. నక్కపల్లిలో వచ్చే పరిశ్రమల కారిడార్‌లో స్థానికులకు ఉపాధి లభించేలా చూస్తానని తెలిపారు. టిడిపి జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత, అనకాపల్లి ఎంపీ సిఎం రమేష్, ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, పంచకర్ల రమేష్‌బాబు, సుందరపు విజయకుమార్, కెఎస్ఎన్ఎస్ రాజు, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, మాజీ ఎమ్మెల్యేలు పీలా గోవింద సత్యనారాయణ, గవిరెడ్డి రామానాయుడు, మాజీ ఎమ్మెల్సీలు బుద్ధ నాగ జగదీశ్వరరావు, పప్పల చలపతిరావు, దువ్వారపు రామారావు, యలమంచిలి నియోజకవర్గం ఇన్‌ఛార్జి ప్రగడ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొల్లు రవీంద్ర

మంత్రి కొల్లు రవీంద్రకు ఘన స్వాగతం

సబ్బవరం : అనకాపల్లి పర్యటనకు సోమవారం విచ్చేసిన ఇన్‌ఛార్జి మంత్రి కొల్లు రవీంద్రకు విశాఖ విమానాశ్రయంలో పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు ఆధ్వర్యంలో కూటమి నేతలు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పంచకర్ల ప్రసాదరావు, సాలాపు వెంకటేశ్వరరావు, బలిరెడ్డి అప్పారావు, ఇందల వెంకటరమణ, గండి ముత్యాల నాయుడు, కోటాన అప్పారావు, పిబివిఎస్ఎన్.రాజు, కోరాడ శ్రీను, సింగంపల్లి శ్రీనివాసరావు, బంటికోళ్ల పద్మ, కర్రి కనకరాజు, టి.శేఖర్ పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన టిడిపి నేతలు

దేవరాపల్లి : అనకాపల్లి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొల్లి రవీంద్రను టిడిపి దేవరాపల్లి మండల నాయకులు సోమవారం అనకాపల్లిలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు చిటిమిరెడ్డి సూర్యనారాయణ, నాయకులు పోతల పాత్రు నాయుడు, చల్లా నానాజీ, కొమర బాబురావు, టి.ప్రసాద్ పాల్గొన్నారు.

స్పీకర్, మంత్రులను కలిసిన ఎస్‌పి

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా సోమవారం రాష్ట్ర శాసనసభ స్పీకర్ సిహెచ్.అయ్యన్న పాత్రుడు, జిల్లా ఇంచార్జి మంత్రి కొల్లు రవీంద్ర, హోంశాఖ మంత్రి వంగల పూడి అనితను కలెక్టరేట్ సమావేశ మందిరంలో మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.

పశుగణనకు ప్రజలు సహకరించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పశు గణన సర్వేకు ప్రజలంతా సహకరించాలని తుమ్మపాల గ్రామ సర్పంచ్ తట్టా పెంటయ్య నాయుడు, ఎంపీటీసీ సభ్యులు చదరం నాగేశ్వరరావు, పంచదార్ల కన్నారావు అన్నారు. ఈ మేరకు సోమవారం వారు గోడ పత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా టెలికాం సభ్యుడు పీల విశ్వేశ్వరరావు, కూటమి నాయకులు పీలా తాతు నాయుడు, తర్రా సత్యారావు, వెంకటఅప్పారావు పాల్గొన్నారు.

పశుగణన పోస్టర్ ఆవిష్కరణ

పరవాడ : పరవాడ ప్రాంతీయ పశువైద్యశాలలో సోమవారం పశు గణన కార్యక్రమం పోస్టర్‌ను పశుసంవర్ధక శాఖ ఎడి డాక్టర్ రామకృష్ణ కీర్తి, పరవాడ సర్పంచ్ సిరిపురపు అప్పలనాయుడు, గ్రామ పెద్దలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో పెద్ద చెరువు ఆయకట్టుదారుల సంఘం ప్రెసిడెంట్ రెడ్డి శ్రీను, పశువైద్యులు సురేష్ కుమార్, ప్రవుల్లా, పశువైద్య సిబ్బంది శ్రీను, కృష్ణ, పశు సంవర్ధక సహాయకులు బాలాజీ, లక్ష్మణ్, నూకరత్నం పాల్గొన్నారు.

జిల్లాలో పశుగణన వాయిదా

ప్రజాశక్తి-యలమంచిలి : జల్లాలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పశుగణన కార్యక్రమం వాయిదా పడిందని యలమంచిలి పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ గంగాధర్ సోమవారం తెలిపారు. వాస్తవానికి పశుగణన సెప్టెంబరు నెల 1 నుండి ప్రారంభించాల్సి ఉండగా దాన్ని అక్టోబరు 25 తేదీకి వాయిదా పడిందని తెలిపారు. యాప్‌లో ఏర్పడ్డ లోపాల కారణంగా ఆ తేదీ కూడా వాయిదా పడిందని, తదుపరి ఉత్తర్వులు వెలువడే వారకూ సర్వే చేపట్టవద్దని అధికార్లు చెప్పారని ఏడి వివరించారు.

పిల్లల చదువుపై తల్లిదండ్రులు దృష్టి సారించాలి

ప్రజాశక్తి-సబ్బవరం : తమ పిల్లల చదువుపై తల్లిదండ్రులు కూడా దృష్టి సారిస్తే క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసిస్తారని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్చార్జ్ ప్రిన్సిపాల్ పివిఎస్.మూర్తి అన్నారు. కళాశాలలో సోమవారం విద్యార్థులు, వారి తల్లితండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలో మౌళిక సదుపాయాలకు, విద్యకు ఇస్తున్న ప్రాముఖ్యత గురించి వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఎం.మోహనరావు, కె.వెంకటేశ్వరరావు, పి.సుభాషిణి, ఎ.జనార్ధనరావు, జె.వివకానందరావు, ఫిజికల్ డైరెక్టర్ కె.రమణారావు, వృత్తి విద్యా లెక్చరర్లు బి.గోవిందరావు, ఎన్.శ్రీనివాసరావు, ఎల్‌వి.రమణ బాబు, పి.రాణి అంబేద్కర్, ఎన్.నీలిమ, ఇ.వెంకటరావు, డి.అన్నపూర్ణ, జి.అనుపమ, ఎం.మూర్తి ఎల్గొన్నారు.

విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్-2024 ప్రారంభం

ప్రజాశక్తి-పరవాడ : ఎన్టీపీసీ సింహాద్రి విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్-2024ను సింహాద్రి హెచ్‌ఓపి ఎస్‌కే సిన్హా నేతృత్వంలోని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. పారదర్శకత, నైతిక ప్రవర్తనను పెంపొందించడంపై అడ్మినిస్ట్రేటివ్ భవనం ముందు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సీజీఎం, సిపిజి రష్మి రంజన్ పరిదా, ఉద్యోగులు పాల్గొన్నారు.

పెండింగ్ అర్జీలను వెంటనే పరిష్కరించాలి

ప్రజాశక్తి- అనకాపల్లి : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టరు విజయ క్రిష్ణన్ ఆదేశించారు. అర్జీదారులతో అధికారులు నేరుగా మాట్లాడాలని, పెండింగు అర్జీలను వెంటనే పరిష్కరించాలని కోరారు. సమస్య పరిష్కారం కాకపోతే అందుకు గల కారణాలను వివరించాలని సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పబ్లిక్ గ్రీవెన్స్‌లో జిల్లా కలెక్టరుతో పాటు జాయింటు కలెక్టరు ఎం.జాహ్నవి, జిల్లా రెవిన్యూ అధికారి బి. దయానిధి, ఎస్డిసి సుబ్బలక్ష్మి ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డును తరలించాలి

అనకాపల్లి నగరం నడిబొడ్డున ఉన్న డంపింగ్ యార్డ్ తరలించాలని విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు పాత్రపల్లి వీరు యాదవ్ కలెక్టరేట్‌లో హౌసింగ్ పీడీ వై.శ్రీనివాసరావుకి వినతిపత్రం అందజేశారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో 35 ఫిర్యాదులు

ప్రజా సమస్యలను చట్టపరిధిలో సత్వరమే పరిష్కరించాలని పోలీసు అధికారులకు ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు, చీటింగ్ 35 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లా ఎస్పీ, అదనపు ఎస్పీ నేరుగా ఫిర్యాదుదారుల నుండి అర్జీలను స్వీకరించి, ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఎం.దేవప్రసాద్, ఎల్.మోహన్ రావు పాల్గొన్నారు.

విద్యాదీవెన, ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం ధర్నా



తహశీల్దారుకు విన్నవిస్తున్న ఎస్ఎఫ్ఐ నేత రమణ, విద్యార్థులు

ప్రజాశక్తి-చోడవరం

పెండింగ్‌లో ఉన్న విద్యా దీవెన, విద్యా వసతి, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని కోరుతూ భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులు ఆందోళన చేపట్టారు. ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా ర్యాలీ నిర్వహించి తహశీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి, వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం. రమణ మాట్లాడుతూ గత సంవత్సరం నుండి డిగ్రీ, పీజీ, బీటెక్, డిప్లమో, ఐటిఐ చదువుతున్న విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయలేదన్నారు. విద్యా దీవెన, విద్యా వసతి ఇవ్వలేదని, దీంతో విద్యార్థులు ఫీజులు కట్టలేక తల్లిదండ్రుల పైన తీవ్రమైన భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కొంతమంది తల్లిదండ్రులు ఫీజులు కట్టడానికి అప్పుల బారిన పడి సొంత భూములు అమ్ముకోవాల్సిన దుస్థితి నెలకొందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి నాలుగు నెలలు దాటినా విద్యార్థుల సమస్యలపై ఎటువంటి నిర్ణయాలు తీసుకోలేదన్నారు. ఒకవైపు సెమిస్టర్ పరీక్షలు వస్తున్నాయని, ఫీజులు కోసం ప్రైవేట్ యాజమాన్యాలు ఒత్తిడి తెస్తున్నాయని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెండింగ్‌లో వాటిని విడుదల చేయకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు అర్జున్, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు ఉపాధి కల్పించాలని వినతి

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని ముత్యాలమ్మపాలెం మత్స్యకారులకు ఫార్మసీ, ఎన్టిపిసిలో ఉద్యోగాలు కల్పించాలని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొల్లి రవీంద్రకు సోమవారం ముత్యాలమ్మ పాలెం సర్పంచ్ చింతకాయల సుజాత ముత్యాలు వినతిపత్రం సమర్పించారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించారని ముత్యాలు తెలిపారు. ఈ మేరకు విశాఖపట్నం ఎయిర్ పోర్ట్‌లో మంత్రిని కలిసి గజమాలతో సత్కరించారు.

వికలాంగులకు దుస్తుల వితరణ

ప్రజాశక్తి-చోడవరం రూరల్ : మండలంలోని వెంకన్న పాలెం గ్రామంలో వికలాంగులకు గోవింద అనే వ్యక్తి సోమవారం భోజనాలు పెట్టి, వారికి దీపావళి పండుగకు కొత్తబట్టలు అందించారు. ప్రతిఒక్కరూ అనాథలు వికలాంగుల పట్ల సేవాభావంతో మెలగాలని, తద్వారా ఒక మంచి విలువలతో కూడిన సమాజాన్ని ముందు ముందు చూడగలుగుతామని చెప్పారు.

పోలీసుల ఆధ్వర్యాన రక్తదానం

ప్రజాశక్తి-కశింకోట : పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా కశింకోట కళ్యాణ మండపం వద్ద సోమవారం పోలీసుల ఆధ్వర్యాన రక్తదాన శిబిరం నిర్వహించారు. దీనిని జిల్లా ఎస్పి తుహిన్ సిన్హా ప్రారంభించారు. అనంతరం రక్తదానం చేసిన కశింకోట గ్రామ యువతను అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు. గాజువాక ఫస్ట్ బ్లడ్ బ్యాంక్ సౌజన్యంతో నిర్వహించిన కార్యక్రమంలో అనకాపల్లి సబ్ డివిజన్ డీఎస్పీ బి.అప్పారావు, కశింకోట సిఐ అల్లు స్వామి నాయుడు, ఎస్సై లక్ష్మణరావు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల రక్షణకు వినతి

ప్రజాశక్తి-దేవరాపల్లి : దేవరాపల్లి పంచాయతీలోని గ్రామకంతలు, ప్రభుత్వ భూములను రక్షించాలని జిల్లా కలెక్టర్‌కు జిల్లా విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సభ్యులు కెవి రమణ సోమవారం వినతిపత్రం ఇచ్చారు. దేవరాపల్లిలో సర్వేనెంబర్ 259/2లో 27 ఎకరాల 56 సెంట్లు గ్రామ కంఠం స్థలాన్ని పరిరక్షించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కోఆపరేటివ్ డైరెక్టర్ వరదపురెడ్డి సన్యాసిరావు, ఇలియాస్ లలితా నాయుడు, గంగవంశం సంతోష్, కోరుపోలు శ్రీను, చొక్కాకుల వెంకటరమణ పాల్గొన్నారు.

పనులు వేగవంతం చేయండి

ప్రజాశక్తి- కె.కోటపాడు : ఎన్ఆర్ఇజిఎస్ నిధులతో చేపడుతున్న పనులు వేగవంతం చేయాలని పంచాయతీరాజ్ డిఈ బి.వెంకటరావు, పి.సుమతి డిమాండ్ చేశారు. ఈ మేరకు చౌడువాడ, పాచిలవానిపాలెం, పైడంపేట గ్రామాలలో జరుగుతున్న సిమెంటు రోడ్లు, కాలువల పనులను సోమవారం వారు పరిశీలించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి దాడి ఎరుకు నాయుడు, వార్డు మెంబరు తనకళ అప్పలనాయుడు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నేవీ రోడ్డు నిర్మాణం చేయకుంటే భారీ వాహనాలను అడ్డుకుంటాం

ప్రజాశక్తి-రాంబిల్లి : రాంబిల్లి నేవీ మెయిన్ గేట్ నుండి వెంకటాపురం జంక్షన్ వరకు ప్రధాన రహదారి పునర్నిర్మాణం చేయకుంటే ప్రయాణికులను, ప్రజలను సమీకరించి ఈ మార్గంలో భారీ వాహనాలను అడ్డుకుంటామని సిపిఎం మండల కార్యదర్శి జి.దేముడునాయుడు హెచ్చరించారు. రాంబిల్లిలో సోమవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఈ ప్రధాన రహదారి పెద్ద గోతులతో ఉండడంతో ప్రజాసంఘాల వినతి మేరకు ఆ గొయ్యిల్లో క్రషర్ మిక్సర్ బుగ్గ వేశారని తెలిపారు. అయితే ప్రతి రోజూ వందల సంఖ్యలో టన్నుల బరువున్న పెద్ద పెద్ద రాళ్ల లోడ్లతో లారీలు నేవీ నిర్మాణం కోసం ప్రధాన రహదారిలో ప్రయాణిస్తున్నాయని తెలిపారు. దీంతో రోడ్డు శిథిలమై గోవింద పాలెం, రాంబిల్లి, కొండవారపాలెం, సంతపాలెం, జంగాలపాలెం గ్రామాల వద్ద చిరు వ్యాపారులు, వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. తక్షణమే ఆర్ అండ్ బి అధికారులు, నేవీ అధికారులు, ఈ ప్రాంత ప్రజా ప్రతినిధులు జోక్యం చేసుకొని కొత్త రోడ్డు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు.

హైస్కూల్ ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-మునగపాక : స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రహరీ గోడ నిర్మాణానికి జనసేన మండల అధ్యక్షులు టెక్కలి పరశురాం సోమవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాసరావు, స్కూల్ కమిటీ చైర్మన్ ఆడారి సూర్యచంద్ర రామారావు, జనసేన నాయకులు శ్రీకాంత్, దొప్ప శ్రీను, సూరిశెట్టి అప్పలనాయుడు, కారుకొండ ప్రసాద్ పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్సీ

ప్రజాశక్తి-దేవరాపలి : తెనుగుపూడి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు సుధీర్, సంజయ్, ఆకర్షలను ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు సోమవారం అభినందించారు. మధురవాడ అంబేద్కర్ గురుకులం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో జరుగుతున్న జోనల్ లెవెల్ సైన్స్ అండ్ ఆర్ట్ ఎగ్జిబిషన్ కార్యక్రమంలో నేవర్ అండ్ ఇండియన్ కల్చర్ అంశంపై తెనుగుపూడి గురుకుల విద్యార్థులు వేసిన పెయింటింగ్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ మేరకు ఎమ్మెల్సీ చిరంజీవిరావు వారిని అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ పి.రఘు, ఆర్ట్ టీచర్ అర్జునరావు పాల్గొన్నారు.



ర్యాలీ చేపడుతున్న పోలీసులు, సిబ్బంది

రహదారి భద్రతపై అవగాహన

ప్రజాశక్తి -నక్కపల్లి:రహదారి భద్రత పై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని హెచ్‌సి శ్రీనివాస్ సూచించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో సోమవారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఏపిఎం కే శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రహదారి భద్రత పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డ్వాక్రా మహిళలతో మానవహారం, ర్యాలీ చేపట్టారు. రహదారి భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. వాహనదారులు హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి, సెల్ ఫోన్ లో మాట్లాడుతూ వాహనాలు నడప రాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీసీలు రాజు, సన్యాసిరావు ,అప్పారావు, నాగ ప్రసాద్ పాల్గొన్నారు.

రెండు పూటలా క్లాసులు నిర్వహించాలని

ఇంటర్ విద్యార్థుల ఆందోళన

ప్రజాశక్తి -నక్కపల్లి:ఫుల్ డే క్లాసులు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు తహసిల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు ఎం.బాలాజీ విద్యార్థులతో కలిసి డిటి అన్నాజీ రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ, నక్కపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సుమారుగా 200 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారన్నారు. ఒక్క పూట మాత్రమే తరగతులు నిర్వహించడంతో విద్యా బోధన సక్రమంగా అర్థం కాకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నార, చదువులో వెనకబడి పోతున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. సమయం తక్కువగా ఉండడంతో ప్రాక్టికల్స్ తరగతులు చెప్పే అవకాశం లేకుండా పోయిందన్నారు. మరో 4 నెలల్లో వార్షిక పరీక్షలు దగ్గర పడుతున్నాయని, విద్యార్థులు ఏ విధంగా సన్నద్ధం కావాలో అర్థం కాలేదన్నారు. ఫుల్ డే తరగతులు నిర్వహించకపోవడంతో విద్యార్థుల భవిష్యత్తు నాశనం అయ్యే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఫుల్ డే క్లాసులు నిర్వహించి, పూర్తిస్థాయిలో విద్యాబోధన అందే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు కె.మణికంఠ, రవి, కృపానంద, లక్ష్మణ్, సురేష్, విద్యార్థులు పాల్గొన్నారు.



డిటికి వినతిపత్రం తీస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

తీరంలో విద్యార్థుల మృతదేహాలు లభ్యం

ప్రజాశక్తి-ఎస్.రాయవరం:ఆదివారం మధ్యాహ్నం రేవుపోలవరం సముద్రంలో గల్లంతయిన విద్యార్థుల మృతదేహాలు లభ్యమైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సోమవారం ఉదయం రేవుపోలవరం జెట్టీ ప్రాంతంలో మృతదేహాలను గుర్తించిన బంధువులు, మెరైన్ పోలీసుల సహకారంతో ఒడ్డుకు చేర్చారు. స్థానిక పోలీసులు బంధువులిచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాలను పోస్టుమార్టమ్ నిమిత్తం నక్కపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతదేహాలను చూసి ఇరు కుటుంబాలకు చెందిన వారి రోదనలతో తీరప్రాంతం విషాదంతో నిండిపోయింది.



మృతదేహాలు

కసిమిలో పోలీసుల దాడులు

ప్రజాశక్తి-గొలుగొండ:గొలుగొండ మండలం కసిమి గ్రామ శివారులో చిత్తులు ఆట ఆడుతున్న వారిపై దాడి చేసినట్లు ఎస్సై రామారావు తెలిపారు. ఇందులో ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకొని 11,250 నగదు, ఐదు సెల్ ఫోన్లు, మూడు బైకులు స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. గ్రామాల్లో ఎవరైనా బెల్ట్ షాపులు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.



హాజరైన అధికారులు, రైతులు

సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి -కోటవురట్ల: రీ సర్వే సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలంటూ సోమవారం కోటవురట్ల గ్రామంలో జరిగిన గ్రామసభలో స్థానిక ఎంపీటీసీ సూర్యారావు అధికారులను కోరారు. తహసిల్దార్ తిరుమల బాబు ఆధ్వర్యంలో జరిగిన సభకు సుమారు 85 వరకు ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. రీ సర్వే కారణంగా పలు సమస్యలు తలెత్తాయని, దీంతో రైతులు రుణాలు తీసుకునేందుకు, విక్రయించుకు నేందుకు, కార్యాలయాల చుట్టూ తిరుగుతూ అవస్థలు పడుతున్నారని పలువురు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ శ్రీనివాస్, వీఆర్ఓ సంఘ నాయకులు రమేష్, తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితుల సమస్యలు పరిష్కరించకుండా

ప్రధానితో శంకుస్థాపన ఎలా చేస్తారు : సిపిఎం

ప్రజాశక్తి-నక్కపల్లి:వైజాగ్ - చెన్నై ఇండస్ట్రీయల్ కారిడార్ నిర్మాణం ప్రారంభం కొరకు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నవంబర్ నెలలో నక్కపల్లి వచ్చి శంకుస్థాపన చేస్తారని అనకాపల్లి పార్లమెంటు సభ్యులు సిఎం రమేష్ ఇటీవల ప్రకటించారని, నిర్వాసితుల సమస్యలు పరిష్కారం చేయకుండా ప్రధానితో శంకుస్థాపన ఎలా చేయిస్తారని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు ప్రశ్నించారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ, ఇప్పటికీ నిర్వాసితులకు పూర్తిస్థాయిలో పరిహారం, ప్యాకేజీ చెల్లించలేదన్నారు. ఇల్లులు కోల్పోతున్న వారికి ఎక్కడ పునరావాసం కల్పిస్తారో ప్రభుత్వం స్పష్టం చేయలేదని, నిర్వాసితులను ఏ విధంగా ఆదుకుంటారో తెలియజేయలేదన్నారు. ప్రభుత్వం, అధికారులు ప్రకటించిన కటాఫ్ తేదీని నిర్వాసితులంతా వ్యతిరేకించారని, పూర్తిస్థాయిలో నిర్వాసితులందరినీ ఆదుకున్న తర్వాత, భూములు స్వాధీనం చేసుకునే తేదీని కటాఫ్‌గా నిర్ణయించి, నాటికి 18 సంవత్సరాల నిండిన ప్రతి ఒక్కరికి 15 లక్షలు, ఇల్లులు కోల్పోతున్న కుటుంబంలో 18 సంవత్సరానికి నిండిన ప్రతి ఒక్కరికి 25 లక్షలు చెల్లించాలని జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం అందజేయడం జరిగిందని తెలిపారు. నేటికీ సమాధానం లేదన్నారు. పెండింగ్ లో ఉన్న జిరాయితీ, డి పట్టా, సాగు భూములకు పరిహారం చెల్లించాల్సి ఉందన్నారు. సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందన్నారు. నిర్వాసితుల సమస్యలన్నీ పరిష్కారం చేసిన తర్వాతే, పరిశ్రమలు ఏర్పాటుకు శంకుస్థాపన చేయాలని, కాదని చేస్తే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎం రాజేష్, నాయకులు బి.రాము, ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంపై శ్రద్ధ వహించాలి

-కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్:ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే ఫిర్యాదుల పరిష్కారంలో అధికారులు మరింత శ్రద్ధ వహించాలని, సంతృప్తికర రీతిలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ సూచించారు. ఒకసారి నమోదైన ఫిర్యాదు మళ్లీ ఓపెన్ కావడానికి వీలు లేదని, అలా జరిగితే ఫిర్యాదుదారులతో తానే స్వయంగా ఫోన్లో మాట్లాడతానని కలెక్టర్ అధికారులను హెచ్చరించారు. అవసరమైతే జిల్లా అధికారులు ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడాలని, నాణ్యమైన పరిష్కారం చూపాలని సూచించారు. కలెక్టరేట్ మీటింగు హాలులో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.ఈరోజు ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ప్రజల నుంచి వివిధ సమస్యలపై 237 వినతులు అందాయి. కలెక్టర్ తో పాటు జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి బిహెచ్ భవానీ శంకర్, ఆర్డీవో పి. శ్రీలేఖ, జివిఎంసి ఎడిసి వర్మ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.



శుభాకాంక్షలు తెలుపుతున్న నేతలు

ఘనంగా రాజేష్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు తనయుడు, మున్సిపల్ కౌన్సిలర్ చింతకాయల రాజేష్ జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. కుటుంబ సభ్యులు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. దుర్గా మల్లేశ్వరి అమ్మవారి ఆలయ కమిటీ సభ్యులు రాజేష్‌కి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, అభిమానులు, అభిమానులు పుష్పగుచ్చాలు అందజేసి రాజేష్ కు శుభాకాంక్షలు తెలిపారు.

బాలల దినోత్సవ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : నవంబర్ 14న జరిగే బాలల దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పిఆర్టియు ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ప్రతిభా పాటవ పోటీలను స్థానిక ఆర్డిఓ వివి రమణ చేతుల మీదుగా జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,తాను కూడా విద్యార్థి దశలో ఇటువంటి పోటీలలో పాల్గొనే వాడినని తనకు క్విజ్ పోటీలు అంటే చాలా ఇష్టమని, అందువలనే తాను పోటీ పరీక్షలో విజయం సాధించి ఈ స్థాయికి చేరుకున్నానని తెలిపారు.విద్యార్థులు చదువుతోపాటు ఇటువంటి పోటీలలో పాల్గొని తమ ప్రతిభ నైపుణ్యాలను పెంచుకోవాలన్నారు. పిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు గోపీనాథ్ మాట్లాడుతూ, అంతర్గత నైపుణ్యాలను వెలికి తీయడం కోసం ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలియజేశారు. మండల అధ్యక్షులు వరహాలు నాయుడు, అసోసియేట్ ప్రెసిడెంట్ కె.వి రమణ పాల్గొన్నారు.

బిఎన్ రోడ్డులో గోతులను పూడ్చండి : సిపిఎం

ప్రజాశక్తి -కొత్తకోట:భీమునిపట్నం -నర్సీపట్నం (బిఎన్) రోడ్డుకు తక్షణమే మరమ్మత్తులు చేపట్టి ప్రయాణికులు ప్రాణాలను కాపాడాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న డిమాండ్ చేశారు.సోమవారం రావికమతం మండల కేంద్రంలో సిపిఎం ముఖ్య కార్యకర్తల సమావేశం పాంగి చంద్రయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ, వడ్డాది నుండి రావికమతం, కొత్తకోట, రోలుగుంట మండలం నిండుగొండ వరకు బిఎన్ రోడ్డులో భారీ గొయ్యిలు ఏర్పడి ప్రమాదకరంగా ఉందన్నారు. ఈ రోడ్డు కు ఇంకా ఎంత మంది బలి కావాలో అధికారులు లెక్క చెప్పాలని దుయ్య బట్టారు. ఈ రోడ్డులో ప్రయానించే ప్రయాణికులు నరక యాతన కు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు మధ్య భారీ గొయ్యిలు ఏర్పడడంతో అనేకమంది యువకులు ప్రాణాలు పోగొట్టుకుంటున్నారన్నారు. సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె.గోవిందరావు మాట్లాడుతూ, ఇప్పటికే ఈ రోడ్డు ప్రమాదంలో కాళ్ళ, చేతులతో పాటు ప్రాణాలు కోల్పోయినా పాలకుల్లో స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు సిహెచ్ సూరిబాబు, గిరిజన సంఘం నాయకులు సిహెచ్ రాజబాబు, పివిటిజీ సంఘం నాయకులు గమ్మెల వాసు తదితరులు పాల్గొన్నారు..



మాట్లాడుతున్న సిపిఎం నేత వెంకన్న

ప్రశస్త యాప్‌పై అవగాహన

ప్రజాశక్తి- కొత్తకోట:రావికమతం మండలం గర్నికం కేజీబీవీలో ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మి నాయుడు, జగన్నాథ నాయుడు కలిసి కేజీబీవీ ప్రిన్సిపల్ ఎం. రమ్య శ్రావణి అధ్యక్షతన ఉపాధ్యాయులుకు ప్రశస్త యాప్ పై అవగాహన కల్పించారు. ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మి నాయుడు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుండి 10వ తరగతి వరకు చదువుతున్న ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించేందుకు 21రకాల వైకల్యాలను ప్రస్తావిస్తూ 'ప్రశస్త' యాప్ రూపొందించారని చెప్పారు. ఈ యాప్ లో సాధారణ విద్యార్థులతో పాటు ప్రత్యేక అవసరాలు గల పిల్లల వివరాలను కూడా నమోదు చేయాలన్నారు. ప్రధానోపా ధ్యాయులు, ఉపాధ్యాయులు, ప్రత్యేక ఉపాధ్యాయులు అందరూ ఈ ప్రశస్త యాప్ ను డౌన్లోడ్ చేసుకుని సర్వే చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గర్నికం కస్తూరిబా బాలిక విద్యాలయం ప్రిన్సిపాల్ రమ్య శ్రావణి పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న మహాలక్ష్మినాయుడు

సముద్ర సంపదను కాపాడుకుందాం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్:మన సముద్ర సంపదను మనమే కాపాడుకుందామని ఫిషరీస్ డిపార్ట్మెంట్ జాయింట్ డైరెక్టర్ జి.విజయ సూచించారు. సోమవారం సాయంత్రం ఫిషరీస్ డిపార్ట్మెంట్, డబ్ల్యు డబ్ల్యు ఎఫ్,గ్రీన్ క్లైమేట్, టీంఎన్జిఒ లు ఫిషింగ్ హార్బర్లో 10 వ నెంబర్ జెట్టీని శుభ్రపరిచారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సముద్రంలో ఉండే ప్లాస్టిక్ వ్యర్థాలను తింటున్న చేపట, తాబేళ్లు మృతి చెందుతున్నాయన్నారు. ఎపి మెకనైజ్డ్ బోట్ ఓనర్ ఎస్.నర్సింగరావు మాట్లాడుతూ, మన సముద్రాన్ని మనమే పరిశుభ్రంగా ఉంచుకోవాలి, లేకుంటే మనకే నష్టం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డబ్ల్యు డబ్ల్యు ఎఫ్ సంస్థ ప్రతినిధి హానీ గ్రీన్, క్లైమేట్ టీం ఎన్ జి ఒ వ్యవస్థాపక కార్యదర్శి జె.వి రత్నం, కోఆర్డినేటర్ జె.రవితేజ, ఎపి బోట్ ఆపరేటర్ల వెల్ఫేర్ సంస్థ ప్రతినిధులు మున్నం బాలాజి , గరగయ్య, ఫిషరీస్ డిపార్ట్మెంట్ అధికారులు పాల్గొన్నారు.

ఇసుకకు ఇబ్బంది లేకుండా చూడాలి

ప్రజాశక్తి- నక్కపల్లి:గృహ నిర్మాణాలు చేపట్టే వారికి ఉచిత ఇసుక సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఎంపీడీవో డి.సీతారామరాజు, డిటి అన్నాజీ రావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఉచిత ఇసుక సరఫరా పై చర్చించారు. నవంబర్ 1వ తేదీన ఎన్. టి. ఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టి శతశాతం పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో శానిటేషన్, క్లోరోనేషన్ పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. చెత్త నుండి సంపద తయారీ కేంద్రాల నిర్వహణ చేపట్టాలని సూచించారు. పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి పిఓపిఆర్డి శ్రీను పాల్గొన్నారు.

సమస్యలపై మున్సిపల్ కార్మికుల ఆందోళనలు



విశాఖలో ఆందోళన చేపడుతున్న కార్మికులు, నాయకులు

తమ సమస్యలను పరిష్కరించాలంటూ జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన విశాఖ నగరంలోని జివిఎంసి జోనల్ కార్యాలయాల వద్ద, అనకాపల్లి పట్టణంలోని జోనల్ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికులు సోమవారం ఆందోళనలు చేపట్టారు. తమ డిమాండ్లను నెరవేర్చాలంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు.

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జివిఎంసిలో దీర్ఘకాలికంగా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై కమిషనర్ స్పందించి 15 రోజుల్లోగా పరిష్కారం చేయాలని, లేనిపక్షంలో సమ్మెకు దిగుతామని జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు పి.వెంకటరెడ్డి, అధ్యక్షులు టి.నూకరాజు, ప్రధాన కార్యదర్శి యు.రాజు హెచ్చరించారు. సోమవారం సాయంత్రం జివిఎంసి కమిషనర్ కార్యాలయంలో వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ పారిశుధ్యం, నీటి సరఫరా, యుజిడి తదితర డిపార్టుమెంట్ల కార్మికుల మినిట్స్ అమలులో జాప్యం చేస్తున్నారని అన్నారు. పారిశుధ్య కార్మికులను ఇతర సెక్షన్ల సేవలకు పంపించడం, సరిపడా పనిముట్లు ఇవ్వకపోవడం వంటి సమస్యల పరిష్కారంలోనూ జాప్యం జరుగుతోందన్నారు. అంగీకరించిన సమస్యలను పరిష్కరించకపోతే లోడర్లుగా వెళుతున్న వారిని నిలుపుదల చేసి సమ్మెలోకి వెళ్తామని స్పష్టం చేశారు. నగర జనాభా, విస్తీర్ణం, వార్డులు ఆధారంగా సిబ్బందిని పెంచాలని, ఖాళీగా ఉన్న డెత్, రిటైర్డ్, దీర్ఘకాలిక అనారోగ్య కార్మికుల పోస్టులకు సంబంధించి వారి బిడ్డలకు ఇంటర్వ్యూలు నిర్వహించి వెంటనే భర్తీ చేయాలన్నారు. కార్పొరేషన్ తీర్మానం జిఒ 36 ప్రకారం రూ.24,500 చెల్లించాలన్నారు. ఐటిఐ వారికి స్కిల్డ్, డిప్లమో, ఇంజనీరింగ్ కార్మికులకు హైలీ స్కిల్డ్ వేతనాలు నిర్ణయించి, మిగిలిన యుజిడి సిబ్బందికి జిఒ 36 వేతనాలు చెల్లించాలన్నారు. క్లాప్, ఈ - ఆటో డ్రైవర్లు, వర్కర్ కం డ్రైవర్లకు జిఒ 36 ప్రకారం రూ24,500 రూపాయలు చెల్లించాలని, 16 రోజుల సమ్మె ఒప్పందం ప్రకారం పండగ కానుక రూ.వెయ్యి, కార్మికుడు ప్రమాద కారణంగా మరణిస్తే రూ.7 లక్షలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.75 వేలు, దహన సంస్కారానికి రూ.20 వేలు చెల్లించాలన్నారు. విజయవాడ వరద బాధితుల సహాయ కార్యక్రమాల్లో పాల్గొన్న వారికి ఒక నెల బోనస్, రెండు జతల బట్టలు కుట్టుకూలితో చెల్లించాలన్నారు. పర్మినెంట్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలన్నారు. లైంగిక వేధింపుల నిరోధక కమిటీని వెంటనే వేయాలన్నారు. జివిఎంసి వద్దనే ఉన్న ఇన్‌కమ్ ట్యాక్స్, విలీన కార్మికుల పిఎఫ్, ఇఎస్ఐ, నైట్ ప్యాకేజీ సొసైటీల వద్ద ఉన్న పిఎఫ్, ఇఎస్ఐలను, జిఒ 333 ఎరియర్స్‌ను వెంటనే చెల్లించాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎంవి.ప్రసాద్ పాల్గొన్నారు.

జోన్ 4 కార్యాలయం వద్ద..

యుజిడి కార్మికులందరికీ జిఒ 36 ప్రకారం జీతాలు చెల్లించాలని జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షులు టి.నూకరాజు డిమాండ్ చేశారు. సోమవారం వెంకటేశ్వర థియేటర్ వద్ద ఉన్న జోన్ 4 కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు జోన్ నాయకులు ఎం.సుబ్బారావు, కెవిపి చంద్రమౌళి, యుజిడి వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు ఇ.ఆదినారాయణ, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎం.ఈశ్వరరావు, ప్రభ, కిషోర్, అనిత, అప్పలరాజు, వెంకటరమణ, రామలక్ష్మి, జగదీష్, రాంబాబు, భాస్కరరావు, రాము, ధన, నాగమణి పాల్గొన్నారు. అనంతరం జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు.

భీమునిపట్నం : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు భీమిలి జోన్ కమిటీ ఆధ్వర్యాన జివిఎంసి ఒకటో జోన్ కార్యాలయం వద్ద పారిశుధ్య కార్మికులు ధర్నా నిర్వహించారు. అనంతరం జోనల్ కమిషనర్ పిల్లి ప్రేమ ప్రసన్న వాణికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు ఆర్ఎస్ఎన్ మూర్తి, నాయకులు రవ్వ నరసింగరావు, భాగం లక్ష్మి, కార్మికులు పాల్గొన్నారు.



నర్సీపట్నంలో నినాదాలు చేస్తున్న నాయకులు



వినతిపత్రం ఇస్తున్న వెంకటరెడ్డి తదితరులు

గాజువాక : జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన గాజువాక జోనల్ కార్యాలయం ఎదుట కార్మికుల ధర్నా చేశారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి ఉరుకూటి రాజు మాట్లాడుతూ, పనిముట్లు, సేఫ్టీ పరికరాలు ఇవ్వాలని డిమాండ్‌చేశారు. అనంతరం జోనల్ కమిషనర్ వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గొలగాని అప్పారావు. కె.కిరీటం, కెవి.రమణ, రాము, మీనాక్షి, సత్యవతి గణేష్, చిన్నారావు, నాగరాజు పాల్గొన్నారు.

అనకాపల్లి : పారిశుధ్య కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు పరచాలని కోరుతూ సోమవారం అనకాపల్లి జోనల్ కమిషనర్ కార్యాలయం వద్ద జీవీఎంసీ జివిఎంసి ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం ఇన్‌ఛార్జి జోనల్ మున్సిపల్ కమిషనర్‌కి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవ అధ్యక్షులు గంటా శ్రీరామ్, నాయకులు ఎర్రంశెట్టి శివ ప్రసాద్, నిమ్మకాయల అజయ్, ఎర్రం శెట్టి ఓంశివ, గూడుప పోలారావు, గోవిందు, నాగరాజు, ఎస్ నూకరాజు, శేఖర్, బొమ్మల రాము సత్యనారాయణ, అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్: మున్సిపాల్టిలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినేంట్ చేయూలని సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం స్థానిక మున్సిపాలిటీ కార్యాలయం వద్ద నిరసన తెలియజేశారు. అనంతరం కమీషనర్ సురేంద్ర కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అద్యక్షులు రుత్తల శంకరరావు మాట్లాడుతూ, మున్సిపాల్టి లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినేంట్ చేయూలని, కనీస వేతనాలు 28వేలు అమలు చేయాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు, యూనియన్ నాయకులు రమణ,రాజు,బాబూరావు, దుర్గా పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి బాడీ బిల్డింగ్ పోటీల్లో సత్తా

ప్రజాశక్తి -కొత్తకోట:రాష్ట్ర స్థాయి బాడీ బిల్డింగ్ పోటీలలో రావికమతం మండలం కొత్తకోకు చెందిన యువకుడు సత్తా చాటి టాప్ టెన్ లో నిలిచాడు. ఆదివారం విజయనగరం లో 29వ మిస్టర్ ఆంధ్ర బాడీ బిల్డింగ్ శాంపియన్ షిప్ -24 అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి బాడీ బిల్డింగ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో గ్రామానికి చెందిన గసాడ మోసే 75 కేజీల విభాగంలో అనకాపల్లి జిల్లా తరుపున పాల్గొని తన ప్రతిభ చూపాడు. సుమారు 200 మంది పోటీలలో పాల్గొనగా ఈ యువకుడు టాప్ టెన్ లో నిలిచాడు. ఆస్పైసియస్ ఆంధ్రప్రదేశ్ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ప్రతినిధులు సర్టిఫికెట్ ప్రధానం చేశారు. గతంలో ఈ యువకుడు విశాఖ లో జరిగిన జిల్లా స్థాయి పోటీలో 5 వ స్థానం సాధించాడు.



సత్తా చాటిన మోసే

ఇసుక అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: మండలంలో గబ్బాడ ఇసుక స్టాక్ పాయింట్‌లో అక్రమంగా తవ్వకాలు చేపట్టిన ఇసుకాసురులపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ, గబ్బాడలో ఉన్న ఇసుక స్టాక్ పాయింట్లో ఉన్న ఇసుకను అక్రమంగా తరలిస్తూ అక్రమార్కులు అక్రమాలకు పాల్పడుతున్నారని తెలిపారు. స్థానిక రెవెన్, పోలీసు సిబ్బంది పొంతనలేని సమాధానాలు ఇస్తున్నారన్నారు. ఈ నెల 25న రాత్రి 7.30 గంటల సమయంలో యార్డు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారన్నారని, ఇది తెలిసి తమ నాయకులు వెళ్లి చూశారని చెప్పారు. ఈ విషయమై అధికారులకు ఫోన్ చేసినా ఎవరూ స్పందించలేదన్నారు. ఈ విషయమై పూర్తి విచారణ చేపట్టి చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమలో మున్సిపల్ వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ, పట్టణ అధ్యక్షులు ఏకా శివ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గణేష్



నీటిని విడుదల చేస్తున్న అధికారులు, సిబ్బంది

పంట కాలువ గేట్‌కు మరమ్మతు పనులు

-ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి -కొత్తకోట:రావికమతం మండలం కల్యాణపు లోవ జలాశయం నుంచి సాగునీరు అందించే పంట కాలువ సూయిస్ గేట్‌కు సోమవారం మరమ్మతులు పూర్తి చేశారు. గత పది రోజులుగా ఈ గేట్ మరమ్మతులకు గురి కావడంతో ఆయుకట్టు భూములకు సాగునీరు అందడం లేదు. దీంతో ఎండిపోతున్న వరి పంట పేరుతో ప్రజాశక్తిలో సోమవారం ప్రచురిచితమైన కథనానికి చోడవరం ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్ రాజు, మండల టిడిపి అధ్యక్షులు రాజాన కొండ నాయుడు తదితరులు చొరవ తీసుకొని జలాశయం అధికారులను అప్రమత్తం చేశారు. యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు పనులను వేగవంతం చేశారు. విజయవాడ, తాటి పూడి, విశాఖ తదితర ప్రదేశాలు నుంచి అనుభవం కలిగిన టెక్నీకల్ బృందాన్ని రప్పించి పనులు పూర్తి చేయించారు. జలాశయం ఏఈ సూర్యనారాయణ, సిబ్బంది ఆధ్వర్యంలో శమించి మరమ్మతులు చేయడంతో పాటు పంట కాలువ ద్వారా సాగునీటిని విడుదల చేశారు.



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం

8 నుండి ప్రజల సమస్యలపై పోరాటాలు

- సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: ప్రజల సమస్యలపై నవంబర్ 8 నుండి 15 వరకు పోరాటాలు చేస్తామని సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం తెలిపారు. సోమవారం స్థానిక సిపిఎం కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రజల పై విద్యుత్, పెట్రోల్, డీజిల్, నిత్యావసరాల వంటి భారాలు తీవ్రంగా మోపుతుందన్నారు. నూనె, కూరగాయల ధరలు అకాశాన్ని అంటుతున్నాయని తెలిపారు. ఉద్యోగాలు లేక యువత రోడ్డున పడ్డారని విమర్శించారు. కార్మికులకు కనీసవేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు గిట్టుబాటు దర కల్పించక పోవడంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు కట్టబెడుతుందని విమర్శించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చేపట్టే పోరాటాలను జయప్రదం చేయాలని కొరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటి సభ్యులు రుత్తల శంఖరరావు, అడిగర్ల రాజు, సీనియర్ నాయకులు త్రిమూర్తులు రెడ్డి, ఈరెల్లి చిరంజీవి, కేవి సూర్యప్రభ, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.